
సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా ఎదుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా, దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

మంగళవారం 03.11.2026

INK OF TRUTH


జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 193 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

మరసు ముప్పు తక్కువే

- అర్నబ్‌తో పోలిస్తే తుపాను తీవ్రత స్వల్పం
- దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు
- 50 టీఎంసీల వరకు వరద ప్రవాహాల అంచనా
- ప్రతి నీటి చుక్కా ఒడిసిపట్టాలి
- ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా అప్రమత్తం
- ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష



ఏపీకి అండగా నిలవండి

- తమిళనాడు, కర్ణాటక సీఎంలకు చంద్రబాబు విజ్ఞప్తి
- విద్యుత్ పునరుద్ధరణకు అదనపు సిబ్బంది అవసరం
- తుపాను ప్రభావిత జిల్లాలకు యంత్రాల తరలింపునకు సన్నాహాలు
- రెండు రాష్ట్రాల నుంచి సానుకూల స్పందన

2 లో

అమరావతి, నవంబరు 2: కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. అర్నబ్ ప్రభావాన్ని ఎదుర్కొనేలా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ముందస్తు ఏర్పాట్లు చేశామని, ఇప్పుడు మురసు తుఫాను ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాను కారణంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 31 వేల విద్యుత్ స్తంభాలను క్షేత్రస్థాయికి పంపించామని అధికారులు వివరించారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది పస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు.

పల్నాడులో అత్యధిక వర్షపాతం అంచనా: మురసు తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మిగతా 2లో...

మరసుపై అప్రమత్తం

- 125 మండలాలకు భారీ వర్ష సూచన
- తీర ప్రాంతాల్లో ప్రజలకు ముందస్తు హెచ్చరికలు
- గ్రామ, వార్డు సిబ్బందితో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ
- అధికారులతో చంద్రబాబు అత్యవసర టెలికాన్ఫరెన్స్

2 లో

తుపాను సాయానికి రూ.37 కోట్లు

- 17 ప్రభావిత జిల్లాలకు నిధుల కేటాయింపు
- ఆరు జిల్లాలకు రూ.3 కోట్ల చొప్పున విడుదల
- మరో 8 జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున
- పునరావాసం, ఆహారం, తాగునీటికి ప్రాధాన్యం

2 లో

మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

టీటీడీ పాలనకు స్పెసిఫైడ్ అథారిటీ

- ముగ్గురు సభ్యులతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు
- చైర్మన్‌గా ఈవో ముద్దాడ రవిచంద్ర
- ట్రస్ట్‌బోర్డు అధికారాలు అథారిటీకి బదలాయింపు

మురసు ఎఫెక్ట్.. విమానాలకు బ్రేక్


- ప్రతికూల వాతావరణంతో 12 సర్వీసులు రద్దు
- విజయవాడ విమానాశ్రయం నుంచి రాకపోకలపై ప్రభావం
- ప్రయాణానికి ముందు వేళలు సరిచూసుకోవాలని సూచన

'మనమిత్ర'తో తక్షణ సాయం



- మురసు బాధితులకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు
- 9552300009కు 'హాయ్' సందేశం పంపితే చాలు
- సమస్యలు నేరుగా అధికారుల దృష్టికి

జీఎస్టీ వసూళ్లలో ఏపీ జోరు



- అక్టోబరులో రూ.4,307 కోట్ల ఆదాయం.. 24 శాతం వృద్ధి

అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ జోరు కొనసాగుతోంది. అక్టోబర్ నెలలో రాష్ట్రానికి జీఎస్టీ ద్వారా రూ. 4,307 కోట్ల ఆదాయం లభించింది. గతేడాది ఇదే నెలలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే 24 శాతం వృద్ధి నమోదైంది. దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ 23 శాతం, కర్ణాటక 18 శాతం, తెలంగాణ 14 శాతం, తమిళనాడు 3 శాతం వృద్ధి నమోదు చేయగా, పుదుచ్చేరి 7 శాతం క్షీణతను చవిచూసింది. జాతీయ స్థాయిలో రాష్ట్రాల సగటు ఆదాయ వృద్ధి 16 శాతంగా ఉంది.

ఎస్‌జీఎస్టీ సెటిల్‌మెంట్ అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ. 23,180 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 18 శాతం వృద్ధి. ఈ వివరాలను కేంద్ర ఆర్థికశాఖ ఆదివారం వెల్లడించింది.

మిగతా 3లో...

చిన్నారి కోలుకుంటోంది

- స్నేహితురాలి కోసం సాహసోపేత పోరాటం చేసిన లక్ష్మికి అభినందనలు
- వైద్యుల సూచనలకు స్పందిస్తున్న బాలిక
- మణిపాల్ వైద్యుల నుంచి శుభవార్త
- ఇద్దరు బాలికలకూ అత్యుత్తమ వైద్యం
- పాఠశాలల్లో భద్రత మరింత పటిష్ఠం చేస్తాం: లోకేశ్

మిగతా 3లో...



అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రి వైద్యులు

పులివెందుల కౌంటింగ్‌పై ఉత్కంఠ

- కౌంటింగ్ నిలిపివేయాలంటూ వైకాపా అనుబంధ పిటిషన్
- ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు
- ఉదయం 7.30 గంటలకు తీర్పు వెల్లడి

3 లో



తుపానులోనూ వైద్య సేవలు యథాతథం



- 13 జిల్లాల్లో 724 వైద్య బృందాలు..
- 4,628 అత్యవసర పడకలు సిద్ధం
- 3,066 మంది గర్భిణుల్లో 1,103 మంది ఆస్పత్రులకు తరలింపు
- అంబులెన్స్ సేవలు ఆర్టీజీఎస్‌తో అనుసంధానం

3 లో

తుపానుపై అప్రమత్తం.. వరదలపై నిఘా

- ఇరిగేషన్ అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం
- గుండ్లకమ్మ, రాళ్లపాడు రిజర్వాయర్లపై ప్రత్యేక దృష్టి

3 లో

తుపానుపై నిరంతర నిఘా

- ఒంగోలు సమీపంలో తీరం దాటనున్న తుపాను
- దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు భారీ వర్ష సూచన
- విద్యుత్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక నిఘా
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక
- అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష

2 లో



అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తోందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇవాళ రాత్రి , రేపు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కేంద్ర సాయం త్వరగా అందించండి



- అర్నబ్ తుఫాను నష్టంపై చంద్రబాబు విజ్ఞప్తి
- ప్రాథమికంగా రూ.4,526 కోట్ల నష్టం అంచనా
- నాలుగు జిల్లాల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన
- వరి, కొబ్బరి, అరటి పంటలకు తీవ్ర నష్టం
- సహాయక, పునరుద్ధరణ చర్యలపై కేంద్ర బృందం ప్రశంసలు

3 లో



విద్యుత్ యంత్రాంగం సర్వసన్నద్ధం

- మురసును ఎదుర్కొనేందుకు మంత్రి గొట్టిపాటి కార్యాచరణ
- 5 వేల మందికి పైగా ఉద్యోగులతో టెలీకాన్ఫరెన్స్
- తుపాను తగ్గిన వెంటనే సరఫరా పునరుద్ధరణకు ఏర్పాట్లు

2 లో

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'మురసు' తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను



పెట్టుబడుల సమ్మిట్‌కు సర్వం సిద్ధం

- విశాఖలో ఈ నెల 12, 13 తేదీల్లో సదస్సు
- పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర అనుకూలతల వివరణ
- ఏర్పాట్లపై సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష

2 లో

అమరావతి, నవంబరు 2 (జర్నలిస్ట్ ఫైల్): ఈనెల 12,13 తేదీల్లో రెండు రోజుల పాటు విశాఖపట్నం ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం ఎపి సచివాలయంలో

ఏపీకి అండగా నిలవండి



అమరావతి, నవంబర్2 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందస్తు చర్యలపై దృష్టి సారించారు. మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో భారీ ఎత్తున విద్యుత్ స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉందనే సూచనలను దృష్టిలో పెట్టుకుని పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు విజయ్, డీకే శివకుమార్ లతో ఆదివారం సీఎం చంద్రబాబు ఫోన్లో మాట్లాడారు. తుఫాను నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థల పునరుద్ధరణ పనులకు అవసరమైన సిబ్బందిని, యంత్రాలను పంపాలని రెండు రాష్ట్రాల సీఎంలను ఆయన కోరారు. దీనిపై ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సానుకూలంగా స్పందించారు. ఏపీకి అవసరమైన మేరకు సహకరిస్తామని తెలిపారు. ఈ మేరకు ఏపీ అధికారులు ఇరు రాష్ట్రాలకు చెందిన శాఖాధికారులను సంప్రదిస్తారని సీఎం చంద్రబాబు వారితో చెప్పారు. అర్నబ్ తుఫాను వల్ల దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్దరించే పనుల నిమిత్తం ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన సిబ్బంది క్షేత్రస్థాయిలో విధుల్లో ఉన్నారు. మరోవైపు అర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్దరణ పనులను ముగించుకున్న పలువురు విద్యుత్ శాఖ సిబ్బందిని ముందు జాగ్రత్తగా మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం సిద్దంగా ఉంచింది.

తుపాను సాయానికి రూ.37 కోట్లు

అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుపాను సహాయక చర్యలు, అత్యవసర వ్యయాల కోసం ప్రభావిత జిల్లాలకు రూ.37 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధన టీఆర్–27 కింద మొత్తం 17 జిల్లాలకు ఈ నిధులను కేటాయించింది.

నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.3 కోట్ల చొప్పున కేటాయించారు. ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు, నంద్యాల జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు.

కడప, సత్యసాయి, అన్నమయ్య జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున కేటాయించారు. పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించడం, సురక్షిత తాగునీరు, ఆహారం, పాలు సరఫరా చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, పారిశుధ్య చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలకు నిధులను వినియోగించాలని ప్రభుత్వం పేర్కొంది.

విద్యుత్కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు దెబ్బతిన్న రోడ్లు, నీటిపారుదల మౌలిక వసతులను అత్యవసరంగా పునరుద్ధరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మురసుపై అప్రమత్తం



అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాను ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగం సన్నద్ధతపై సమీక్షించారు. తుఫాను తెల్లవారుజామున ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం వద్ద తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు కొత్తపట్నం పరిసరాల్లో వర్షాలు, గాలుల తీవ్రతపై సీఎం ఆరా తీశారు. నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం చిరుజల్లులు పడుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఒంగోలులో మోస్తరు వర్షం, తుఫాను తీరం దాటే కొత్తపట్నం సమీపంలో చిరుజల్లులు పడుతున్నాయని అధికారులు వెల్లడించారు. తుఫాను తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తీరం దాటే వరకు ప్రజలు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సమాచారం క్షేత్రస్థాయికి చేరేలా గ్రామ, వార్డు కార్యాలయాల సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. ఆస్తి నష్టం తగ్గించడంతో పాటు కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు కూలినా, సరఫరాకు అంతరాయం కలిగినా పునరుద్ధరణ పనులను వేగంగా చేపట్టేందుకు విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మురసు తుఫాను ప్రభావంతో నేడు పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 263 మిల్లీమీటర్లు, గుంటూరులో 242, బాపట్లలో 146, పల్నాడులో 143 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. కృష్ణా జిల్లాలో 97.67, ప్రకాశంలో 52.43, ఏలూరులో 51.55, పశ్చిమ గోదావరిలో 41.50 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని పలు మండలాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మొత్తంగా 125 మండలాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

'మనమిత్ర'తో తక్షణ సాయం



అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు రియల్టైమ్ గవర్నెన్స్ సొసైటీ అధికారులు తెలిపారు. విద్యుత్ సమస్యలు, చెట్లు కూలడం, గోడలు కూలడం, నీరు చేరడం తదితర సమస్యలను ఈ సేవ ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

9552300009లిలి నంబర్కు 'హాయ్' అని వాట్సాప్ సందేశం పంపి ఈ సేవను వినియోగించుకోవచ్చని తెలిపారు. అనంతరం సేవల ఎంపికలో లిలి'మురసు సైక్లోన్ ఇష్యూస్'లిలి ఆప్షన్ను ఎంచుకుని, 'రిపోర్ట్ ఇష్యూ', 'కన్ఫర్మ్', 'రిజిస్ట్రేషన్' ఎంపికలను వరుసగా ఎంచుకోవాలని సూచించారు.

తర్వాత పేరు, జిల్లా, మండలం వివరాలను నమోదు చేసి, తుపాను కారణంగా తమ ప్రాంతంలో ఎదురవుతున్న సమస్యను వివరించాలి. సమస్యకు సంబంధించిన ఫొటోలను కూడా అప్లోడ్ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ప్రజలు నమోదు చేసిన సమస్యలను వెంటనే సంబంధిత ప్రాంత అధికారులకు పంపించి, పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఈ వ్యవస్థ పనిచేస్తుందని పేర్కొన్నారు. తుపాను సమయంలో అత్యవసర సాయం పొందేందుకు ప్రజలందరూ 'మనమిత్ర' సేవను వినియోగించుకోవాలని ఆర్టీజీఎస్ అధికారులు కోరారు.

మురసు ముప్పు తక్కువే



(మొదటి పేజీ తరువాయి)

పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అధికారులు అంచనా వేశారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉందని, నాగార్జునసాగర్కు కూడా భారీగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వం-ర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్లను నింపాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్లోని జలాశయాల్లో నీటిని నిల్వ చేసుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మార్కాపురంలోని కంభం చెరువుతో పాటు ఆయా జిల్లాల్లోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలను కంట్రోల్ రూమ్ల ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు : మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీ ఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహ రించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతి రెండు గంటలకు బులెటిన్ : వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓసారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు. తుఫాను అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల బీమా పరిహారం, ఇన్పుట్ సబ్సిడి ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్నిమాపక సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వర్చువల్ గా హాజరయ్యారు.

తుపానుపై నిరంతర నిఘా

(మొదటి పేజీ తరువాయి)



తుపాను అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించిన నేపథ్యంలో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల కలెక్టర్లు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యుత్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి : బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ముందుగానే వాటిని తొలగించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా, మొబైల్ నెట్వర్క్ సేవల్లో అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెగిపడిన వైర్లను తాకకుండా దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపించినా, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి: తుపాను ప్రభావం దృష్ట్యా మత్స్యకారులను ముందుగానే అప్రమత్తం చేయాలని మంత్రి ఆదేశించారు. సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయడంతోపాటు, ఇప్పటికే ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని, అవసరమైన చోట్ల సహాయక చర్యలకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.

48 గంటల పాటు హై అలర్ట్ : రానున్న 48 గంటల పాటు అధికార యంత్రాంగం హై అలర్ట్లో ఉండాలని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయాన్ని వేగంగా అందించాలని అధికారులను ఆదేశించారు.

అధికారిక హెచ్చరికలు పాటించాలి : రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సమన్వయంతో తుపాను కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజలు అధికారికంగా జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే నిర్ధారణ లేని సమాచారాన్ని, వదంతులను నమ్మవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరారు. తుపాను సంబంధిత సమస్యలపై తక్షణ సహాయం కోసం మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. అత్యవసర సహాయం అవసరమైనవారు విపత్తుల నిర్వహణ సంస్థకు చెందిన 112, 1070, 18004250101 నంబర్లకు ఫోన్ చేయాలని హోంమంత్రి అనిత సూచించారు. ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యమని, తుపాను ప్రభావం తగ్గే వరకు అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని స్పష్టం చేశారు.

టీటీడీ పాలనకు స్పెసిఫైడ్ అథారిటీ

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి పదవీకాలం ముగియడంతో టీటీడీ పాలనలో ఎలాంటి విరామం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కూడిన స్పెసిఫైడ్ అథారిటీని నియమిస్తూ రెవెన్యూ (దేవాదాయ) శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి జీవో ఎంఎస్ నంబర్ 658ను విడుదల చేశారు.

1987 దేవాదాయ చట్టంలోని సెక్షన్ 137 ప్రకారం ఈ స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముద్దాడ రవిచంద్ర చైర్మన్గా వ్యవహరించనున్నారు. ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సభ్యులుగా నియమితులయ్యారు.

స్పెసిఫైడ్ అథారిటీ పదవీకాలాన్ని ఏడాదిగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వ్యవధిలో కొత్త ట్రస్ట్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, స్పెసిఫైడ్ అథారిటీ అదే సమయంలో రద్దవుతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ట్రస్ట్ బోర్డుకు చట్టపరంగా ఉన్న అధికారాలు, విధులు ఈ అథారిటీకి కూడా వర్తిస్తాయని పేర్కొంది.

2024 నవంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ పాలకమండలిని ఏర్పాటు చేసింది. బీఆర్ నాయుడు చైర్మన్గా 29 మంది సభ్యులతో ట్రస్ట్ బోర్డును నియమించింది. ఆ పాలకమండలి పదవీకాలం 2026 అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో కొత్త పాలకమండలి ఏర్పాటయ్యే వరకు టీటీడీ పరిపాలన కొనసాగించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది.

మురసు ఎఫెక్ట్.. విమానాలకు బ్రేక్

విజయవాడ (గన్నవరం): 'మురసు' తుఫాను కారణంగా ప్రతికూల వాతావరణం ఏర్పడటంతో నేడు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మీదుగా ప్రయాణించాల్సిన పలు విమాన సర్వీసులను రద్దు చేసినట్లు విమానయాన సంస్థలు ప్రకటించాయి. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఇండిగో సంస్థకు చెందిన 10 సర్వీసులు, ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్కు చెందిన రెండు సర్వీసులను రద్దు చేశారు.

రద్దయిన ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ సర్వీసులు:

ఐఎక్స్ 2413/2414: విశాఖపట్నం – విజయవాడ – విశాఖపట్నం

ఐఎక్స్ 2405/2406: హైదరాబాద్ – విజయవాడ – హైదరాబాద్

రద్దయిన ఇండిగో విమాన సర్వీసులు:

6ఈ 7730/6ఈ 7304: విశాఖపట్నం – విజయవాడ – చెన్నై (రాక: మధ్యాహ్నం 12:10, పోక: మధ్యాహ్నం 12:30)

6ఈ 7215/6ఈ 7708: బెంగళూరు – విజయవాడ – తిరుపతి (రాక: మధ్యాహ్నం 12:45, పోక: మధ్యాహ్నం 1:05)

6ఈ 6263/6ఈ 6327: హైదరాబాద్ – విజయవాడ – హైదరాబాద్ (రాక: మధ్యాహ్నం 1:15, పోక: మధ్యాహ్నం 1:45)

6ఈ 7707/6ఈ 7216: తిరుపతి – విజయవాడ – బెంగళూరు (రాక: మధ్యాహ్నం 3:45, పోక: సాయంత్రం 4:05)

6ఈ 7305/6ఈ 7305: చెన్నై – విజయవాడ – కోయంబత్తూరు (రాక: సాయంత్రం 4:05, పోక: సాయంత్రం 4:25)

6ఈ 7223/6ఈ 7224: బెంగళూరు – విజయవాడ – బెంగళూరు (రాక: సాయంత్రం 5:25, పోక: సాయంత్రం 5:45)

6ఈ 2580/6ఈ 2581: హైదరాబాద్ – విజయవాడ – హైదరాబాద్ (రాక: సాయంత్రం 6:35, పోక: రాత్రి 7:10)

6ఈ 7306/6ఈ 7306: కోయంబత్తూరు – విజయవాడ – చెన్నై (రాక: రాత్రి 7:05, పోక: రాత్రి 7:25)

6ఈ 5158/6ఈ 5127: ముంబై – విజయవాడ – ముంబై (రాక: రాత్రి 7:30, పోక: రాత్రి 8:00)

6ఈ 7247/6ఈ 7246: బెంగళూరు – విజయవాడ – బెంగళూరు (రాక: రాత్రి 8:35, పోక: రాత్రి 8:55)

తుఫాను తీవ్రత కారణంగా విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందే సంబంధిత విమానయాన సంస్థల ద్వారా విమాన వేళలను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు.

పెట్టుబడుల సమ్మిట్కు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ అధికారులతో సమీక్షించారు. ఈసమావేశంలో ప్రధానంగా రానున్న పార్టనర్ షిప్ సమ్మిట్ విజయంతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. పెద్దఎత్తున దేశ విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా ఏర్పాట్లు ఉండాలని అందుకనుగుణంగా సంబంధిత శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని సూసించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటుకు ఉన్న అనూకుల పరిస్థితులను సమ్మిట్ కు వచ్చే పెట్టుబడి దారులను సమగ్రమంగా వివరించి ఆయా రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చే రీతిలో అధికారులు కృషి చేయాలని సిఎస్ సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇంకా ఈసమావేశంలో పార్టనర్ షిప్ సమ్మిట్ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి డా.ఎన్.యువరాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ పార్టనర్ షిప్ సమ్మిట్ కు సంబంధించిన ఏర్పాట్లు ఇతర అంశాలపై వివరించారు. ఈభాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొనున్నారని వివరించారు.

అదే విధంగా ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ పాల్గొనున్నారని తెలిపారు. దేశ విదేశీ ప్రతినిధులు, వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొనున్నారని వివరించారు. ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ముఖ్య కార్యదర్శులు ఎస్.సురేశ్ కుమార్, ముఖేష్ కుమార్ మీనా, కాంతిలాల్ దండే, ఐఅండ్పి కార్యదర్శి ఎన్.యువరాజ్, విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, ఏపిఐఐసి ఎండి దినేష్ కుమార్, చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, గీతాంజలి శర్మ ఎపి ఫైబర్నెట్ ఎండి, ఎంఎస్ఎంఇ సిఇఒ విశ్వ, ఎపి ఇడిబి సిఇఒ షన్మోహన్, ఎపి ఎయిర్పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి ప్రవీణ్ ఆదిత్య, పరిశ్రమల శాఖ డైరెక్టర్ షబ్నమ్ బన్సల్, ఎపిఐఐసి ఇడి యశ్వంత్ కుమార్ రెడ్డి తదితర అధికారులు పాల్గొనగా వర్చువల్ గా ఐఅండ్పిఆర్ డైరెక్టర్ కెఎస్.విశ్వనాధన్ పాల్గొన్నారు.

విద్యుత్ యంత్రాంగం సర్వసన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంటూ, ఆ సంస్థ పరిధిలోని సీఎండీ నుంచి క్షేత్రస్థాయి లైన్మెన్ వరకు 5 వేల మందికి పైగా ఉద్యోగులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను సన్నద్ధత, విద్యుత్ వ్యవస్థ రక్షణ, ప్రజలకు అవగాహన, పునరుద్ధరణ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

గత అనుభవాలతో పటిష్ఠ కార్యాచరణ : గతంలో అర్నబ్ తుపాను సమయంలో ఎదురైన సమస్యలను సమీక్షించి, అవి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, లైన్లకు జరిగే నష్టాన్ని ముందుగానే అంచనా వేయాలని చెప్పారు. అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్ఫార్మర్లు, మరమ్మతు పరికరాలు, వాహనాలు, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తుపాను తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి విద్యుత్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తుపాను ప్రభావం తగ్గిన వెంటనే సురక్షిత పరిస్థితులను అంచనా వేసి, క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి : తుపాను సమయంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. మీడియా, సిటీ కేబుల్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంతో పాటు ప్రతి విద్యుత్ ఉద్యోగి తన వాట్సాప్ స్టేటస్లోనూ భద్రతా సూచనలు ఉంచాలని కోరారు. స్థానిక సోషల్ మీడియా గ్రూపుల్లోనూ సమాచారాన్ని విస్తృతంగా పంచుకోవాలన్నారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు దూరంగా ఉండాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించేలా ప్రచారం చేయాలన్నారు.

ఉద్యోగుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యం : విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించే విద్యుత్ సిబ్బంది భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు సేవలు అందించడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో ఉద్యోగులు తమ ప్రాణాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించకుండా విధులు నిర్వహించరాదన్నారు. రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచుకుని, సురక్షిత పరిస్థితులు నిర్ధారించిన తర్వాతే మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.

ఆసుపత్రులకు జనరేటర్ బ్యాకప్ : తుపాను సమయంలో ఆసుపత్రులు, ఇతర అత్యవసర సేవలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట జనరేటర్ బ్యాకప్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజారోగ్యం, రెవెన్యూ, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేస్తే తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు.

ఇతర రాష్ట్రాల సిబ్బందికి ప్రత్యేక ఏర్పాట్లు : పునరుద్ధరణ పనుల కోసం తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే



విద్యుత్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, నాణ్యమైన భోజనం, తాగునీరు, రవాణా సదుపాయాలు కల్పించాలని మంత్రి సూచించారు. ఇందుకోసం ముందుగానే స్థానికంగా అందుబాటులో ఉన్న కల్యాణ మండపాలను గుర్తించి సిద్ధం చేసుకోవాలని అధికారులకు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ప్రజల భద్రత, విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

కేంద్ర సాయం త్వరగా అందించండి

అమరావతి, నవంబర్ 2: అర్నబ్ తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం వాటిల్లడంతో, కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందించేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి వెల్లడించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, దీనికి సంబంధించిన నివేదికను ఇప్పటికే కేంద్రానికి సమర్పించామని చెప్పారు. తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. కేంద్ర హోం, వ్యవసాయం, జల వనరులు, జాతీయ రహదారులు, ఆర్థిక విభాగాలకు చెందిన అధికారులు ఈ బృందంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదిక సమర్పించిన వెంటనే... నష్టం అంచనాకు కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించడంపై ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన సిఫార్సులు సమర్పించాలని కోరారు. కేంద్రం నుంచి సత్వర ఆర్థిక సాయం అందితే రాష్ట్రానికి ఎంతో ఊరట కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అర్నబ్ తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు కోనసీమ, పశ్చిమగోదావరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించిన విషయాన్ని కేంద్ర బృందం సభ్యులు



ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ జిల్లాల్లో తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు కేంద్ర బృందం అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను ప్రభావంతో వరి, కొబ్బరి, అరటి వంటి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు కేంద్ర బృందం గుర్తించింది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించింది. ముఖ్యంగా పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను తీవ్రత కారణంగా రైతులకు నష్టం మరింత పెరిగిందని బృందం సభ్యులు తెలిపారు.

ఓవైపు కరువు...మరోవైపు తుఫాన్లు : వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన, ఆక్వా కల్చర్ వంటి వాణిజ్య పంటలు కూడా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. మత్స్యకారుల పడవలకు సైతం నష్టం వాటిల్లిందన్నారు. అర్నబ్ తుఫాను మిగిల్చిన నష్టం నుంచి ఇంకా కోలుకోకముందే మురసు తుఫాను రాష్ట్రాన్ని తాకుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. హుద్ హుద్, తిత్లీ, మోంథా వంటి తుఫాన్లు గతంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టాన్ని కలిగించాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఒక ప్రాంతం ఎల్‌నినో వల్ల తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటుండగా, మరో ప్రాంతం తుఫాన్ల ప్రభావానికి గురవుతోందన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకే ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నామని... అలాగే తుఫాన్లను ఎదుర్కొనేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నామని సీఎం చెప్పారు. రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంతో పాటు వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను అనుసంధానం చేయడం ద్వారా తుఫాను సమయంలో ప్రాణనష్టాన్ని భారీగా తగ్గించగలిగామని ముఖ్యమంత్రి కేంద్ర బృందానికి వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆర్టీజీఎస్, వాట్సాప్ మనమిత్ర కీలకంగా వ్యవహరించాయని కేంద్ర బృందం అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాలకు కూడా సిఫార్సు చేస్తామని కేంద్ర బృందం తెలిపింది.

తుఫాను కారణంగా విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం 7 వేల మంది సిబ్బందితో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పునరావాసం, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులను ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు, సహాయక చర్యలు–పునరుద్ధరణ పనులకు చేసిన కృషిని కేంద్ర బృందం ప్రశంసించింది. ముఖ్యంగా విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంది. మారుమూల ప్రాంతాల్లో సైతం ఈ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించింది.

తుపానులోనూ వైద్య సేవలు యథాతథం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మురసు తుపాను నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంది. ప్రభావితమయ్యే అవకాశం ఉన్న 13 జిల్లాల్లో 724 వైద్య బృందాలు, 4,628 అత్యవసర పడకలు, 205 సహాయ శిబిరాలను సిద్ధం చేసింది. 866 ప్రభుత్వ వైద్యశాలల్లో 398 వైద్యశాలలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. 359 అంబులెన్సులు (108), 128 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు (102), 320 సంచార వైద్య వాహనాలు (104)అందుబాటులో ఉంచారు. అంబులెన్స్ సేవలను ఆర్టీజీఎస్ పోర్టల్‌తో అనుసంధానించారు. సుమారు 300 ప్రైవేటు అంబులెన్సులను కూడా ఆర్టీజీఎస్ పోర్టల్‌తో అనుసంధానించారు. ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) ద్వారా అంబులెన్సుల వివరాలను ఒకే డిజిటల్ వేదికపై పర్యవేక్షిస్తారు. తుపాను సమయంలో అత్యవసర వైద్య సేవలను వేగంగా అందించడంతో పాటు, అవసరమైన ప్రాంతాలకు అంబులెన్సులను సమర్థంగా కేటాయించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుంది. రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో అంటువ్యాధుల నిఘా కేంద్రాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

గర్భిణుల భద్రతకు ముందస్తు చర్యలు : నవంబర్ 1 నుంచి 10వ తేదీ మధ్య ప్రసవ గడువు ఉన్న 3,066 మంది గర్భిణులను గుర్తించగా, 1,103 మందిని సమీప ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన వారిని అవసరాన్ని బట్టి ముందుగానే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారి నివాస ప్రాంతాలను బట్టి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో ప్రసవ సదుపాయాలు కల్పిస్తున్నారు.

వైద్య సదుపాయాలు సిద్ధం : తీర ప్రాంతాల్లోని 121 ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. పాముకాటు నివారణకు 15,161 ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. 848 వైద్యశాలల్లో జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్తు సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. నీరు, దోమలు, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నీటి శుద్ధికి క్లోరిన్ మాత్రలను సిద్ధం చేశారు. సురక్షిత తాగునీటి సరఫరాకు పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పురపాలక శాఖలతో సమన్వయం చేస్తున్నారు. ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

తుపాను సన్నద్ధతకు చేపట్టిన ఏర్పాట్ల వివరాలను అధికారులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు.

తుపానుపై అప్రమత్తం.. వరదలపై నిఘా



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మురసు తుఫాన్ నేపథ్యంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తుఫాన్ ప్రభావం, భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సమీక్షించారు.

ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, వివిధ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు (సీఈలు), సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. నెల్లూరు–ఒంగోలు మధ్య మురసు తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నందున అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కృష్ణా, పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఇరిగేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నాగార్జునసాగర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అక్కడి నుంచి వచ్చే వరద ప్రవాహాలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. గుండ్లకమ్మ, రాళ్లపాడు రిజర్వాయర్లకు వరద వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాజెక్టుల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ప్రతి రెండు గంటలకు ఒకసారి రిజర్వాయర్లలోకి వస్తున్న నీటి ప్రవాహాలు, నీటిమట్టాలు, విడుదల చేస్తున్న నీటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని స్పష్టం చేశారు.

తుఫాన్ ప్రభావంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ఫ్లడ్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఫ్లడ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణం, వరద పరిస్థితులపై సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టంతో పాటు పంట నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

పులివెందుల కౌంటింగ్‌పై ఉత్కంఠ



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : పులివెందుల నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఉత్కంఠ కొనసాగుతోంది. కౌంటింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ కడప వైఎస్సార్సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆ పార్టీ అభ్యర్థి ప్రమీలమ్మ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ పూర్తయింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

పులివెందుల నియోజకవర్గంలో పోలింగ్ సందర్భంగా అక్రమాలు చోటుచేసుకున్నాయని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని 70 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు. అయితే ఈసీ కేవలం నాలుగు పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే రీపోలింగ్‌కు అనుమతించిందని కోర్టుకు వివరించారు.

రీపోలింగ్‌కు సంబంధించి ఇప్పటికే హైకోర్టులో ప్రధాన పిటిషన్ దాఖలు చేశామని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఆ పిటిషన్‌పై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదని తెలిపారు. ప్రధాన పిటిషన్ పరిష్కారమయ్యే వరకు పులివెందుల ఓట్ల లెక్కింపు చేపట్టకూడదని కోరారు. కౌంటింగ్ పూర్తయితే పిటిషనర్లకు నష్టం జరిగే అవకాశం ఉందని కోర్టుకు విన్నవించారు. పిటిషనర్ల వాదనలను విన్న హైకోర్టు ధర్మాసనం, ఇరు పక్షాల వాదనలు పూర్తయిన అనంతరం తీర్పును రిజర్వ్ చేసింది. పులివెందుల ఓట్ల లెక్కింపుపై తుది నిర్ణయాన్ని ఉదయం 7.30 గంటలకు వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. దీంతో కౌంటింగ్ ప్రారంభానికి కొద్దిసేపటి ముందు హైకోర్టు వెలువరించనున్న తీర్పుపై రాజకీయ వర్గాలతో పాటు పులివెందుల ప్రజల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

అమరావతి పునర్నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.15 వేల కోట్లు

- **గుంటూరు పార్లమెంట్ పరిధిలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులులిలి**
- **జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు**
- **సంక్షేమంతో పాటు శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధి**
- **కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్**



గుంటూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని మేడికొండూరు మండలంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా డోకిపర్రు, మేడికొండూరు, తురకపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

నిర్మాణ రంగం పుంజుకుంది : 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని పెమ్మసాని తెలిపారు. గతంలో ఇసుక కొరత, రహదారుల దుస్థితి కారణంగా భవన నిర్మాణ రంగం తీవ్రంగా ప్రభావితమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం పుంజుకోవడంతో ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు.

అమరావతి పునర్నిర్మాణానికి కేంద్ర సహకారం : గతంలో నిలిచిపోయిన అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.15 వేల కోట్ల నిధులు సమకూరాయని పెమ్మసాని తెలిపారు. ప్రస్తుతం అమరావతిలో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గుంటూరు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, గ్రామీణ రహదారుల నిర్మాణం తదితర అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

గుంటూరు పార్లమెంట్ పరిధిలో సుమారు రూ.3 వేల కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రైల్వే గేట్ల వద్ద రాకపోకలకు ఇబ్బందులు తగ్గించేందుకు ఏడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలను మంజూరు చేయించామని చెప్పారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభమయ్యాయని, మరికొన్ని పూర్తయ్యే దశలో ఉన్నాయని వివరించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా : రాష్ట్రంలో అర్హులైన పేదలకు నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన విద్యార్థికి రూ.13 వేల ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా ఇళ్లను మంజూరు చేయించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా కృషి చేశామని తెలిపారు. రాష్ట్రానికి 75 వేల ఇళ్లకు బదులుగా మూడు లక్షల ఇళ్లు తీసుకురాగలిగామని చెప్పారు.

సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పెమ్మసాని అన్నారు. పేదలకు ఆర్థిక చేయూత అందిస్తూనే ఉపాధి అవకాశాలు పెంచే కార్యక్రమాలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.

జల్ జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు : ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ కీలకమని పెమ్మసాని పేర్కొన్నారు. గతంలో ఈ పథకం కింద కేంద్రం నిధులు కేటాయించినప్పటికీ రాష్ట్ర వాటా సమకూరకపోవడం, పనులు ముందుకు సాగకపోవడం వల్ల ఆశించిన లక్ష్యం నెరవేరలేదని తెలిపారు.

ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిలిచిపోయిన జల్ జీవన్ మిషన్ పనులను 2028–29 వరకు పొడిగించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు తిరిగి పనులు ప్రారంభిస్తున్నామని వివరించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి : రాష్ట్ర ఆదాయం, ఖర్చుల మధ్య వ్యత్యాసం కారణంగా ఆర్థిక పరిమితులు ఉన్నాయని పెమ్మసాని తెలిపారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, అప్పులపై వడ్డీలు, సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం వంటి అనేక అవసరాలకు భారీగా నిధులు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు.

ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం నుంచి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు తీసుకొచ్చి రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి : మేడికొండూరు ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు రెండు చెరువులను అభివృద్ధి చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పెమ్మసాని హామీ ఇచ్చారు. చెరువుల అభివృద్ధికి సంబంధించి ఎదురవుతున్న ఆక్రమణలు, న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి పనులు చేపడతామని చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా, కొత్త పింఛన్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎంపీ కార్యాలయం లేదా ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా తెలియజేయవచ్చని, వాటి పరిష్కారానికి బాధ్యత తీసుకుంటామని చెప్పారు.

కుల, మత, ప్రాంత, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

చిన్నారి కోలుకుంటోంది



(మొదటి పేజీ తరువాయి)


ఉదయాన్నే ఈ శుభవార్తను తెలియజేశారని చెప్పారు. బాలిక వైద్యుల సూచనలను అర్థం చేసుకుని స్పందిస్తోందని, ఆమె త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బాలిక ఆరోగ్యం మెరుగుపడుతున్న వార్త ఆమె కోసం ప్రార్థిస్తున్న ప్రతి ఒక్కరికీ ఎంతో ఊరటనిచ్చే విషయమని లోకేష్ పేర్కొన్నారు. రాప్తాడులో జరిగిన దారుణ దాడిలో గాయపడిన చిన్నారి త్వరగా కోలుకోవాలని రాష్ట్ర ప్రజలంతా ప్రార్థిస్తున్నారని తెలిపారు.

తన స్నేహితురాలిని కాపాడేందుకు ప్రాణాలకు తెగించి పోరాడిన మరో బాలిక లక్ష్మి ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శమని లోకేష్ అన్నారు. దుండగుడు రంపంతో పాఠశాలలోకి ప్రవేశించి దాడికి పాల్పడిన సమయంలో లక్ష్మి భయపడి పారిపోకుండా స్నేహితురాలికి అడ్డుగా నిలిచిందని, ఈ క్రమంలో తాను కూడా తీవ్రంగా గాయపడిందని తెలిపారు. నిజమైన స్నేహానికి, ధైర్యానికి లక్ష్మి నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఇద్దరు బాలికలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఈ కష్ట సమయంలో వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేష్ తెలిపారు. ఇద్దరు విద్యార్థినులకు అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ఏ చిన్నారి కూడా తరగతి గదిలో భయపడాల్సిన పరిస్థితి రాకుండా పాఠశాలల్లో భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని స్పష్టం చేశారు. ఇద్దరు బాలికలు త్వరగా కోలుకుని మళ్లీ చిరునవ్వులతో పాఠశాలకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

జీఎస్టీ వసూళ్లలో ఏపీ జోరు



(మొదటి పేజీ తరువాయి)

అక్టోబరులో దేశవ్యాప్తంగా రూ.2.31 లక్షల కోట్లు : దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి. గతేడాది అక్టోబర్‌లో నమోదైన రూ.1.88 లక్షల కోట్లతో పోలిస్తే 22.9 శాతం వృద్ధి నమోదైంది. ఈ నెలలో రూ.27,934 కోట్ల మేర రీఫండ్‌లు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. దసరా సీజన్‌లో వ్యాపార లావాదేవీలు పెరగడం పన్ను వసూళ్లు పెరగడానికి ప్రధాన కారణంగా పేర్కొంది.

వాణిజ్య పన్నుల వసూళ్లలో 20 శాతం వృద్ధి : ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ నెల వాణిజ్య పన్నుల వసూళ్లలో 20 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది అక్టోబర్‌లో రూ.4,458 కోట్లు వసూలు కాగా.. ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.5,329 కోట్లకు పెరిగాయి. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగవంతం కావడంతో నిర్మాణ రంగానికి సంబంధించిన జీఎస్టీ వసూళ్లలో 59.83 శాతం వృద్ధి నమోదైనట్లు రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ ఎ.బాబు తెలిపారు.

2026 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రాష్ట్ర వాణిజ్య పన్నుల వసూళ్లు రూ.35,765 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే కాలంలో రూ.30,351 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. నికర జీఎస్టీ వసూళ్లు రూ.23,217 కోట్లుగా నమోదై 17.4 శాతం వృద్ధి సాధించాయి. గతేడాది ఇదే కాలంలో నికర వసూళ్లు రూ.19,781 కోట్లుగా ఉన్నాయి.

ఎస్‌జీఎస్టీ ద్వారా రూ.1,504 కోట్లు : అక్టోబర్‌లో రాష్ట్ర ఎస్‌జీఎస్టీ ద్వారా రూ.1,504 కోట్ల ఆదాయం లభించింది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే రూ.257 కోట్లు అదనంగా వసూలయ్యాయి. స్థూల జీఎస్టీ వసూళ్లలో 19 శాతం వృద్ధి నమోదై రూ.3,582 కోట్లకు చేరాయి. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే రూ.562 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది.

కేంద్రం నుంచి అక్టోబర్‌కు సంబంధించి రూ.2,077.24 కోట్ల ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ రాష్ట్రానికి లభించింది. 2025 అక్టోబర్‌తో పోలిస్తే ఇది రూ.303.76 కోట్లు అధికం కావడం గమనార్హం.

పురపోరు కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

అమరావతి, నవంబర్ 3 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. 13 నగరపాలక సంస్థలు, 79 మున్సిపాలిటీలు, నగరపంచాయతీలకు సంబంధించిన ఓట్లను ఆయా కేంద్రాల్లో లెక్కించనున్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లు, సిబ్బంది, ఇతర మౌలిక వసతులను సిద్ధం చేశారు.



ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం వార్డు సభ్యులు, మేయర్ అభ్యర్థులకు వచ్చిన ఓట్లను లెక్కిస్తారు. ఈసారి మేయర్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడంతో వార్డుల ఫలితాలతో పాటు మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపునూ చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,942 వార్డులు, డివిజన్లు ఉండగా.. నగరపాలక సంస్థల్లో 922, మున్సిపాలిటీలు, నగరపంచాయతీల్లో 3,020 వార్డులు, డివిజన్లు ఉన్నాయి.

కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత : నామినేషన్లు, పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. సంబంధిత అభ్యర్థితో పాటు ఎన్నికల ఏజెంట్, ప్రధాన ఎన్నికల ఏజెంట్‌లను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.

మధ్యాహ్నానికి కౌంటింగ్ సరళి స్పష్టమయ్యే అవకాశం ఉండగా, రాత్రికి పూర్తిస్థాయి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ద్వారా పరోక్ష పద్ధతిలో డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక జరగనుంది. నవంబర్ 5, 6 తేదీల్లో ఈ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


కుప్పకూలిన ప్రైవేటు జెట్ విమానం..

ఫ్లోరిడా : అమెరికాలోని ఫ్లోరిడాలో లియర్‌జెట్–60 అనే ప్రైవేటు వ్యాపార విమానం ఆదివారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. దక్షిణ ఫ్లోరిడాలోని పామ్ బీచ్ కౌంటీలో జరిగిన ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న తొమ్మిది మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. టెక్సాస్‌లోని ఆస్టిన్ నుంచి బహామాస్‌కు వెళుతుండగా ఫ్లోరిడాలోని గ్రీన్‌ఏకర్స్ ప్రాంతంలో ఉన్న నివాస సముదాయం సమీపంలో జనసమ్మర్దంగా ఉండే రోడ్డు పైకి విమానం నిలువుగా దూసుకొచ్చి పడిపోయింది. భూమిని ఢకన్న వెంటనే విమానంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి పేలిపోయింది. విమానం కూలిపోవడానికి కొన్ని నిమిషాల ముందు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో పైలట్ మాట్లాడారు. విమానంపై మంచు పేరుకుపోతోందని, నిమిషానికి 20 వేల నుంచి 32 వేల అడుగుల వేగంతో కిందికి పడిపోతున్నామని ఆయన ఆందోళనతో చెప్పారు. 'మాకు సమయం అయిపోయింది' అంటూ పైలట్ చెప్పిన చివరి మాటలు రికార్డయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. సమీపంలోని నీటి పైప్‌లైన్లు, ఇళ్లు దెబ్బతిన్నాయి. భద్రతా కారణాల రీత్యా ఆ ప్రాంతంలోని 600 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి రెడ్‌క్రాస్ సాయంతో షెల్టర్లు ఏర్పాటు చేశారు.



1991 జ్ఞాపకం.. 2026 కొత్త పరీక్ష

- **ఆర్థిక సంక్షోభం పునరావృతం కాకపోయినా.. సంస్కరణల అవసరం మాత్రం పునరావృతమవుతోంది**



1991.. భారత ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయి. విదేశీ మారక నిల్వలు అడుగంటిపోవడం, అంతర్జాతీయ చెల్లింపుల సంక్షోభం, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి.. దేశాన్ని ఒక అంచుకు చేర్చాయి. అదే సంక్షోభం భారత ఆర్థిక విధానాల్లో మౌలిక మార్పులకు దారితీసింది. ఆర్థిక వ్యవస్థను నియంత్రణల చెర నుంచి బయటకు తీసుకొచ్చి సంస్కరణల బాట పట్టించిన కాలంగా 1991 చరిత్రలో నిలిచిపోయింది.

అందుకే "2026 కూడా 1991లాగే ఉంటుంది" అన్న ముఖ్య ఆర్థిక సలహాదారు వీ. అనంత నాగేశ్వరన్ వ్యాఖ్య సహజంగానే దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించింది. అయితే ఆయన ఉద్దేశం మరో ఆర్థిక సంక్షోభం రానుందనే హెచ్చరిక కాదు. లిలి1991 తరహాలోనే 2026 కూడా భారత ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసే కీలక మలుపుగా మారవచ్చన్నది ఆయన సూచన.లిలి ఈ తేడాను అర్థం చేసుకోవడం అత్యంత అవసరం.

ప్రస్తుతం భారత్ 1991 నాటి స్థితిలో లేదు. స్థూల ఆర్థిక స్థిరత్వం, విదేశీ మారక నిల్వలు, బ్యాంకింగ్ వ్యవస్థ బలం, దేశీయ మార్కెట్ పరిమాణం, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి అనేక అంశాల్లో దేశం గణనీయంగా ముందుకు వచ్చింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలోనూ భారత్‌ను ఒక స్థిరమైన, స్థితిస్థాపకమైన ఆర్థిక వ్యవస్థగా చూస్తున్నారు. అయినప్పటికీ, లిలిస్థిరత్వం ఉందని సవాళ్లు లేవని భావించడం మరో ప్రమాదం.లిలి

మారుతున్న ప్రపంచంలో పాత వ్యూహాలు సరిపోవు : నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ కేవలం మార్కెట్ల మధ్య కాదు.. సరఫరా గొలుసులు, సాంకేతిక పరిజ్ఞానం, ఇంధనం, కీలక ముడిసరుకులు, తయారీ సామర్థ్యం, డేటా, కృత్రిమ మేధస్సు వంటి అంశాల చుట్టూ సాగుతోంది. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న కొద్దీ ఆర్థిక పరస్పర ఆధారపడటం కూడా ఒక వ్యూహాత్మక అంశంగా మారుతోంది.

ఇటీవల చైనా కీలక మౌలిక పరికరాల ఎగుమతులపై లైసెన్సింగ్ విధానాన్ని ప్రకటించడం ఈ మారుతున్న పరిస్థితులకు ఒక ఉదాహరణ. ఒక దేశం వద్ద ఉన్న కీలక సాంకేతికత, ముడిసరుకు లేదా పరికరాన్ని మరో దేశంపై ఒత్తిడి తీసుకురావడానికి ఉపయోగించే పరిస్థితి ఏర్పడితే.. దిగుమతులపై అధికంగా ఆధారపడే ఆర్థిక వ్యవస్థలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

అందుకే లిలి'మేక్ ఇన్ ఇండియా' అనేది కేవలం తయారీ నినాదంగా కాకుండా ఆర్థిక భద్రతా వ్యూహంగా మారాల్సిన సమయం వచ్చింది.లిలి టన్నెల్ బోరింగ్ మెషీన్ల నుంచి సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాలు, ఇంధన సాంకేతికత వరకు కీలక రంగాల్లో దేశీయ సామర్థ్యాలను పెంచుకోవడం అత్యవసరం.

దిగుమతులు తగ్గించడం మాత్రమే పరిష్కారం కాదు : అయితే స్వావలంబన అంటే ప్రపంచం నుంచి పూర్తిగా దూరమవడం కాదు. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఏ దేశమూ ఒంటరిగా ఎదగలదు. అవసరమైన చోట దిగుమతులు చేసుకుంటూనే, వ్యూహాత్మక రంగాల్లో దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలి. పోటీకి తట్టుకునే నాణ్యత, ధర, సాంకేతిక సామర్థ్యాలను దేశీయ పరిశ్రమ సాధించాలి.

ఇక్కడ ప్రభుత్వ బాధ్యత కీలకం. పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన-అభివృద్ధికి ప్రోత్సాహం, చౌకైన మరియు నిరంతర విద్యుత్, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ అవసరం. అదే సమయంలో పరిశ్రమలు కూడా ప్రభుత్వ ప్రోత్సాహకాలపై మాత్రమే ఆధారపడకుండా ఉత్పాదకత, సాంకేతికత, నాణ్యతపై పెట్టుబడులు పెంచాలి.

కరోనా తర్వాత ఆర్థిక ప్రపంచం మారిందిలి : నాగేశ్వరన్ ప్రస్తావించిన మరో అంశం కూడా గమనించదగినదే. కరోనా ముందు నాలుగు దశాబ్దాల ఆర్థిక అనుభవాన్ని యథాతథంగా భవిష్యత్తుకు అన్వయించడం ఇక సాధ్యం కాదన్న సంకేతం ఇందులో ఉంది.

గతంలో వచ్చిన అనేక ఆర్థిక సంక్షోభాలు ప్రధానంగా డిమాండ్ కొరతతో ముడిపడి ఉండేవి. కేంద్ర బ్యాంకుల వడ్డీ విధానాలు, ద్రవ్య ఉద్దీపనల ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం ద్వారా వాటి ప్రభావాన్ని తగ్గించే అవకాశం ఉండేది. కానీ నేటి సమస్యలు అంత సులభంగా పరిష్కరించగలిగేవి కావు.

సరఫరా గొలుసుల అంతరాయం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన భద్రత, వాతావరణ మార్పు, సాంకేతిక పోటీ, డిజిటల్ మార్పు వంటి అంశాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. అందువల్ల రేపటి ఆర్థిక విధానాలకు ద్రవ్య విధానం ఒక్కటే సమాధానం కాదు.

ఏఐ.. అవకాశమా? సవాలా? : కృత్రిమ మేధస్సు వేగంగా విస్తరిస్తున్న సమయంలో మరో కొత్త ప్రశ్న ముందుకొస్తోంది. ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన డేటా సెంటర్లు, కంప్యూటింగ్ శక్తి, విద్యుత్, నీరు, చిప్ తయారీ వంటి మౌలిక వనరులను ఎలా సమకూర్చాలి? ఏఐ ఉత్పాదకతను పెంచే అపారమైన అవకాశాన్ని అందిస్తోంది. అదే సమయంలో భారీ స్థాయిలో మూలధనం, విద్యుత్, నీటి వనరులను వినియోగిస్తోంది. ఉద్యోగాల స్వరూపాన్ని మార్చే సామర్థ్యం కూడా దానికి ఉంది. కాబట్టి ఏఐపై పెట్టుబడులు పెట్టడం మాత్రమే కాకుండా.. ఏఐ యుగానికి తగిన నైపుణ్యాలను భారత యువతకు అందించడం కూడా అంతే ముఖ్యమైనది.

భారత్‌కు ఇక్కడ ఒక ప్రత్యేక అవకాశం ఉంది. భారీ యువ జనాభా, విస్తృత డిజిటల్ మౌలిక సదుపాయాలు, పెద్ద దేశీయ మార్కెట్, సాంకేతిక రంగంలో ఇప్పటికే ఉన్న సామర్థ్యం దేశానికి అనుకూలమైన అంశాలు. వీటిని ఉత్పాదకత పెంపు, ఉపాధి సృష్టి, ఎగుమతుల విస్తరణకు ఉపయోగించగలిగితే ఏఐ విప్లవం భారత్‌కు కొత్త ఆర్థిక దశను తెచ్చిపెట్టగలదు.

2026 ఇచ్చే సందేశం : కాబట్టి 2026ను 1991తో పోల్చినప్పుడు భయపడాల్సిన అవసరం లేదు. కానీ ఆ పోలికను తేలికగా తీసుకోవాల్సిన అవసరం కూడా లేదు. 1991 మనకు ఒక సంక్షోభం నుంచి బయటపడటమే కాకుండా సంక్షోభాన్ని సంస్కరణలకు అవకాశంగా మార్చుకోవడం నేర్పింది.

2026లో భారత్ ఎదుర్కొంటున్న సవాలు వేరే స్వరూపంలో ఉంది. దేశీయ సామర్థ్యాలను పెంచుకోవాలి. కీలక దిగుమతులపై అధిక ఆధారపడటాన్ని తగ్గించాలి. తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయాలి. ఇంధన భద్రతను పెంచాలి. వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచాలి. సాంకేతిక స్వావలంబన సాధించాలి. ఏఐ వంటి కొత్త సాంకేతిక పరిణామాలను అవకాశాలుగా మలుచుకోవాలి.

1991 మనల్ని సంక్షోభం నుంచి సంస్కరణల వైపు నడిపించింది. 2026 మనల్ని స్థిరత్వం నుంచి సామర్థ్యం, స్వావలంబన, సాంకేతిక నాయకత్వం వైపు నడిపించాల్సిన సందర్భం.భారత ఆర్థిక వ్యవస్థకు ఇప్పుడు కావాల్సింది భయంతో తీసుకునే నిర్ణయాలు కాదు.. ముందుచూపుతో తీసుకునే నిర్ణయాలు. ప్రపంచ పరిణామాలను ఎదుర్కొనే స్థితిస్థాపకతతో పాటు, ప్రపంచానికి అవసరమైన వస్తువులు, సాంకేతికత, సేవలను అందించే సామర్థ్యాన్ని పెంచుకోవాలి.

1991ను మళ్లీ ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా.. 1991 ఇచ్చిన పాఠాలను మాత్రం మళ్లీ గుర్తుచేసుకోవాల్సిన సమయం ఇది.

డిజిటల్ దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు?

- **భయపెట్టి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తప్పనిసరి**



సాంకేతికత మన జీవితాలను సులభతరం చేసింది. అదే సాంకేతికతను నేరగాళ్లు ఆయుధంగా మార్చుకుంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతుందో 'డిజిటల్ అరెస్టు' మోసాలు రుజువు చేస్తున్నాయి. పోలీసులమని, సీబీఐ అధికారులమని, ఈడీ అధికారులమని, న్యాయమూర్తులమని పరిచయం చేసుకుంటూ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి, గంటల తరబడి లేదా రోజుల తరబడి తమ నియంత్రణలో ఉంచి, చివరకు బ్యాంకు ఖాతాల్లోని డబ్బును కాజేయడం సాధారణ సైబర్ మోసం కాదు. ఇది భయాన్ని ఆయుధంగా మార్చుకున్న వ్యవస్థీకృత నేరం.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు దేశంలో పెరుగుతున్న డిజిటల్ మోసాల తీవ్రతను మరోసారి వెలుగులోకి తెచ్చాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 28న డిజిటల్ అరెస్టు మోసాలను "డిజిటల్ దోపిడీ"గా అభివర్ణించింది. ముఖ్యంగా వృద్ధులు, పదవీ విరమణ చేసినవారిని లక్ష్యంగా చేసుకునే నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది.

డిజిటల్ అరెస్టు మోసాల్లో అసలు ఆయుధం తుపాకీ కాదు.. భయం. "మీపై కేసు నమోదైంది", "మీ ఆధార్ లేదా బ్యాంకు ఖాతా మనీలాండరింగ్‌కు ఉపయోగించారు", "ఇప్పుడే అరెస్టు చేస్తాం", "కోర్టు ముందు హాజరు కావాలి" అంటూ నేరగాళ్లు బాధితులను మానసికంగా కుంగదీస్తారు. వీడియో కాల్‌లో పోలీసు యూనిఫాంలో కనిపించడం, నకిలీ గుర్తింపు కార్డులు చూపించడం, నకిలీ నోటీసులు పంపడం, న్యాయస్థానాల పేర్లు-లోగోలు ఉపయోగించడం వంటి పద్ధతులతో మోసాన్ని నమ్మేలా చేస్తారు. చివరకు "దర్యాప్తు కోసం డబ్బును మరో ఖాతాకు బదిలీ చేయాలి" అంటూ జీవితకాల పొదుపును దోచేస్తారు.

ఇటువంటి మోసాలకు వృద్ధులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎక్కువగా లక్ష్యంగా మారడం మరింత ఆందోళనకరం. జీవితాంతం పొదుపు చేసిన డబ్బు ఒక్కసారిగా పోతే ఆర్థిక నష్టం మాత్రమే కాదు.. మానసికంగా కూడా వారు తీవ్రంగా కుంగిపోతారు. కొందరు అవమానభారంతో ఫిర్యాదు చేయడానికి కూడా వెనుకాడుతారు. అందుకే ఈ నేరాలను కేవలం సైబర్ నేరాల గణాంకాల్లో మరో కేసుగా చూడటం ప్రమాదకరం.

అయితే కఠిన శిక్షలు విధించాలనే డిమాండ్‌తో పాటు చట్టబద్ధమైన న్యాయప్రక్రియను కూడా గౌరవించాలి. నేరం నిరూపణకు ముందు ఎవరికీ శిక్ష విధించలేం. సుప్రీంకోర్టు వ్యాఖ్యల ఉద్దేశం కూడా న్యాయపరమైన ప్రక్రియను పక్కన పెట్టడం కాదు; ఇలాంటి వ్యవస్థీకృత నేరాలపై చట్టం అనుమతించే పరిధిలో అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేయడమే. ఈ తేడాను ప్రభుత్వాలు, దర్యాప్తు సంస్థలు స్పష్టంగా పాటించాలి.

ఇదే సమయంలో దేశవ్యాప్తంగా నమోదైన కేసులను ఒకచోట చేర్చాలన్న నిందితుల అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించకపోవడం కూడా ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చింది. నిందితుల సౌకర్యం కోసం బాధితులను వారి ప్రాంతాల నుంచి దూరం చేయలేమన్న న్యాయస్థానం వైఖరి బాధితుల హక్కులకు ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. వివిధ రాష్ట్రాల్లో నమోదైన కేసుల దర్యాప్తును ఒక అభ్యర్థన ద్వారా నిలిపివేసే పరిస్థితికి తావివ్వకూడదని కోర్టు స్పష్టం చేసింది.

కానీ ఇక్కడ మరో పెద్ద ప్రశ్న ఉంది. నేరగాళ్లు ఒక బాధితుడి ఖాతా నుంచి డబ్బు తీసుకున్న తర్వాత అది ఎక్కడికి వెళ్తుంది? ఎన్ని ఖాతాల ద్వారా మళ్లుతుంది? ఆ ఖాతాలు ఎవరివి? సిమ్ కార్డులు ఎవరు సమకూరుస్తున్నారు? నకిలీ గుర్తింపు పత్రాలు ఎక్కడ తయారవుతున్నాయి? వీడియో కాల్స్‌కు అవసరమైన సాంకేతిక వ్యవస్థను ఎవరు నిర్వహిస్తున్నారు? ఈ మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించకుండా కేవలం చివరి దశలో ఉన్న వ్యక్తులను అరెస్టు చేస్తే నేరానికి మూలం మిగిలిపోతుంది.

ఇందుకే మ్యూల్ అకౌంట్లు కీలక అంశంగా మారుతున్నాయి. సైబర్ నేరగాళ్లు ఇతరుల బ్యాంకు ఖాతాలను డబ్బు స్వీకరించేందుకు ఉపయోగించి, ఆ మొత్తాన్ని అనేక ఖాతాల ద్వారా మళ్లించే విధానం విస్తరిస్తోంది. సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమానాస్పద ఖాతాలు, లావాదేవీలపై తాత్కాలిక డెబిట్ హోల్డ్ వంటి చర్యలకు సంబంధించిన ప్రమాణాల అవసరాన్ని ప్రస్తావించింది.


ఇటీవలి పరిణామాల్లో బ్యాంకుల బాధ్యతపైనా సుప్రీంకోర్టు దృష్టి పెట్టడం గమనార్హం. అక్టోబర్ 29న జరిగిన విచారణలో, ఆర్థిక సంస్థల నిర్లక్ష్యం లేదా తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల డిజిటల్ మోసం జరిగితే బాధితులకు పరిహారం కల్పించే విధానంపై కోర్టు దృష్టి సారించింది. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడం, అవసరమైనప్పుడు తాత్కాలికంగా నిలిపివేయడం వంటి భద్రతా చర్యలపై కూడా చర్చ జరిగింది.అందువల్ల డిజిటల్ అరెస్టు మోసాలను అరికట్టడం పోలీసుల ఒక్కరి బాధ్యత కాదు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు విభాగాలు, బ్యాంకులు, టెలికాం సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారాలు సమన్వయంతో పనిచేయాలి. ఫిర్యాదు చేసిన వెంటనే డబ్బును నిలిపివేసే వ్యవస్థ మరింత వేగంగా పనిచేయాలి. నేరగాళ్ల ఖాతాలను గుర్తించి సొమ్మును రికవరీ చేసే ప్రక్రియను సులభతరం చేయాలి. రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి వేగవంతం కావాలి.

అంతకంటే ముఖ్యంగా ప్రజల్లో అవగాహన పెరగాలి. ఫోన్‌లో ఎవరైనా అరెస్టు చేస్తున్నామని చెబితే అది అరెస్టు కాదు. ఏ పోలీసు అధికారి అయినా, ఏ దర్యాప్తు సంస్థ అయినా వీడియో కాల్‌లో బెదిరించి డబ్బు బదిలీ చేయమని ఆదేశించడం చట్టబద్ధమైన అరెస్టు ప్రక్రియ కాదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్ నిలిపివేసి, సంబంధిత పోలీసు లేదా అధికారిక సైబర్ క్రైమ్ వ్యవస్థను సంప్రదించాలి. ముఖ్యంగా కుటుంబంలోని వృద్ధులు ఇలాంటి మోసాలకు గురికాకుండా పిల్లలు, బంధువులు వారికి తరచుగా అవగాహన కల్పించాలి.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయి. నేరగాళ్లు సాంకేతికతలో ఒక అడుగు ముందుంటే, చట్ట అమలు సంస్థలు రెండు అడుగులు ముందుండాలి. లేకపోతే ప్రజలు సాంకేతిక పురోగతిని భయంతో చూడాల్సిన పరిస్థితి వస్తుంది.

డిజిటల్ అరెస్టు పేరుతో ప్రజల భయాన్ని దోచుకోవడం ఆగాలి. నేరగాళ్లను పట్టుకోవడం మాత్రమే కాదు.. వారి నెట్‌వర్క్‌ను ఛేదించాలి. బాధితుల సొమ్మును వీలైనంత త్వరగా తిరిగి అందించాలి. సాంకేతికతపై ప్రజలకు నమ్మకం పెంచాలంటే, సాంకేతికతను నేరాలకు ఆయుధంగా మార్చే వారిపై చట్టం మరింత వేగంగా, మరింత కచ్చితంగా పనిచేయాలి. సుప్రీంకోర్టు హెచ్చరికను ప్రభుత్వాలు ఇక కార్యాచరణగా మార్చాల్సిన సమయం వచ్చింది.

పేదరికంపై భారత్ ఘన విజయం



- **12 ఏళ్లలో 49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి**
- **భారత్ పురోగతిపై వరల్డ్ బ్యాంక్ ప్రశంస**

భారత్ ఆర్థిక ప్రగతిలో మరో కీలకమైన మైలురాయి నమోదైంది. దేశంలో తీవ్ర పేదరికం గణనీయంగా తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించడం ఆశావహ పరిణామం. 2011-12లో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం 2023-24 నాటికి 2.6 శాతానికి పడిపోయింది. అంటే 12 ఏళ్ల వ్యవధిలో తీవ్ర పేదరికం భారీగా తగ్గింది. ఇదే సమయంలో రోజుకు 4.20 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే వారి వాటా 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది. సుమారు 49.6 కోట్ల మంది ఈ పేదరిక రేఖకు పైకి వచ్చినట్లు ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

ఇది సాధారణ గణాంకం కాదు. కోట్లాది కుటుంబాల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పుకు ఇది ఒక సూచిక. పేదరిక నిర్మూలనలో భారత్ ప్రపంచంలోనే వేగంగా పురోగతి సాధించిన దేశాల్లో ఒకటిగా నిలిచిందని ప్రపంచ బ్యాంకు పేర్కొనడం కూడా గమనార్హం.

పేదరికం తగ్గడం.. పెద్ద విజయమే : తీవ్ర పేదరికం తగ్గడానికి పలు కారణాలు దోహదపడ్డాయి. వినియోగ వ్యయం పెరగడం, ఉపాధి అవకాశాల విస్తరణ, ముఖ్యంగా గ్రామీణ మహిళలు చెల్లింపు ఆధారిత పనుల్లోకి రావడం, ఆహార సబ్సిడీలతో సహా సామాజిక సంక్షేమ పథకాల విస్తరణ వంటి అంశాలు పేదరికం తగ్గడానికి తోడ్పడ్డాయని ప్రపంచ బ్యాంకు విశ్లేషించింది. 2017 నుంచి 2023 మధ్య ఉపాధి సుమారు 13.4 కోట్ల మేర పెరిగినట్లు కూడా నివేదిక పేర్కొంది.

అయితే పేదరికాన్ని తగ్గించడంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషించినప్పటికీ, శాశ్వతంగా పేదరికం నుంచి బయటపడాలంటే స్థిరమైన ఆదాయం, నాణ్యమైన ఉపాధి, మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య భద్రత వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

2.6 శాతంతో సమస్య పూర్తయినట్టేనా? : ఇక్కడే అసలు ప్రశ్న. తీవ్ర పేదరికం 2.6 శాతానికి తగ్గడం గొప్ప విజయమే అయినా, పేదరిక సమస్య పూర్తిగా పరిష్కారమైందని భావించడం సరికాదు.

ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం రోజుకు 3 డాలర్ల అంతర్జాతీయ తీవ్ర పేదరిక రేఖకు దిగువన ఇంకా సుమారు 3.5 కోట్ల మంది ఉన్నారు. అంతేకాకుండా, తక్కువ మధ్య ఆదాయ దేశాలకు వర్తించే రోజుకు 4.20 డాలర్ల పేదరిక రేఖకు దిగువన ఇంకా సుమారు 23.2 కోట్ల మంది ఉన్నారు.

అందువల్ల పేదరిక నిర్మూలనలో సాధించిన విజయాన్ని నిలబెట్టుకోవడంతో పాటు మిగిలిన పేద కుటుంబాలను కూడా స్థిరమైన ఆదాయ స్థాయికి తీసుకురావడం తదుపరి లక్ష్యం కావాలి.

ఆదాయ అసమానతలు ఇంకా ఆందోళనకరం : పేదరికం తగ్గిందని చెప్పడం ఒక కోణం. ప్రజల మధ్య ఆదాయ పంపిణీ ఎంత సమానంగా ఉందన్నది మరో ముఖ్యమైన కోణం.

ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2023లో అగ్రస్థానంలోని 10 శాతం మంది కార్మికుల మధ్యస్థ ఆదాయం, దిగువ 10 శాతం మంది కార్మికుల మధ్యస్థ ఆదాయం కంటే సుమారు 13 రెట్లు ఎక్కువగా ఉంది. అంటే పేదరికం తగ్గుతున్నప్పటికీ ఆదాయ అసమానతలు పూర్తిగా తొలగిపోలేదన్నమాట.

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా లేదా అన్నదే ఇక్కడ కీలకం. ఆర్థిక వృద్ధి వేగంగా ఉన్నా, ఆ వృద్ధి ద్వారా సృష్టించే సంపదలో దిగువ వర్గాల వాటా పెరగకపోతే సమగ్ర అభివృద్ధి లక్ష్యం నెరవేరదు.

పేదరికం భౌగోళికంగా కేంద్రీకృతం : దేశవ్యాప్తంగా పేదరికం ఒకే స్థాయిలో తగ్గలేదు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం దేశంలోని పేద జనాభాలో సుమారు 57 శాతం ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు విస్తరించిన ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది.

దీంతో ఇకపై పేదరిక నిర్మూలన వ్యూహం కూడా ప్రాంతాలవారీగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. వెనుకబడిన రాష్ట్రాల్లో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ రంగాలు, నైపుణ్యాభివృద్ధి, పట్టణ ఉపాధి అవకాశాలను పెంచాల్సి ఉంటుంది.

ఉపాధి ఉంటేనే పేదరికానికి శాశ్వత పరిష్కారం : పేదరిక నిర్మూలనలో నగదు బదిలీలు, ఉచిత ఆహారం, సబ్సిడీలు వంటి సంక్షేమ చర్యలు అవసరమే. అయితే ఇవి తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి. కుటుంబాన్ని శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి లిలిస్థిరమైన, గౌరవప్రదమైన ఉపాధిలిలి అత్యంత కీలకం.

ప్రపంచ బ్యాంకు కూడా ఉపాధి పెరిగినప్పటికీ, ఉపాధి వృద్ధిలో తక్కువ ఉత్పాదకత కలిగిన రంగాల వాటా అధికంగా ఉందని, వాస్తవ ఆదాయాల్లో పెద్దగా మార్పు కనిపించలేదని పేర్కొంది. అంతేకాక యువత నిరుద్యోగిత రేటు కూడా పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.

ఇది పాలకులకు ముఖ్యమైన హెచ్చరిక. దేశ జనాభాలో యువత వాటా అధికంగా ఉన్న సమయంలో వారికి నాణ్యమైన ఉద్యోగాలు లభించకపోతే భవిష్యత్తులో పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక, ఆర్థిక సవాళ్లు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

2047 లక్ష్యానికి పేదరిక నిర్మూలనే పునాది : 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యం ముందు ఉంది. ఆ లక్ష్యం కేవలం తలసరి ఆదాయం పెరగడం, జీడీపీ పరిమాణం పెరగడం ద్వారా సాధ్యం కాదు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, గృహం, తాగునీరు, పారిశుద్ధ్యం, సామాజిక భద్రత అందాలి.పేదరికం 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గడం భారత్ సాధించిన గొప్ప ముందడుగు. కానీ లిలి2.6 శాతం కూడా సున్నా కాదు. ఇంకా పేదరికంలో ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ దృష్టిలో ఒక సంఖ్య కాదు.. ఒక జీవితం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు.

అందుకే తాజా ప్రపంచ బ్యాంకు నివేదికను విజయోత్సవంగా మాత్రమే చూడకుండా, తదుపరి కార్యాచరణకు మార్గదర్శకంగా తీసుకోవాలి. పేదరికాన్ని తగ్గించాం.. ఇక అసమానతలను తగ్గించాలి. ఉపాధి నాణ్యతను పెంచాలి. ప్రాంతీయ అంతరాలను తొలగించాలి. యువతకు అవకాశాలు కల్పించాలి. మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచాలి.

అప్పుడే పేదరికం తగ్గిన గణాంకం.. ప్రజల జీవన ప్రమాణాల్లో శాశ్వతమైన మార్పుగా మారుతుంది.

పేదరిక నిర్మూలనలో భారత్ ముందడుగు వేసింది. ఇక లక్ష్యం ఒక్కటే- అభివృద్ధి ఫలాలు చివరి కుటుంబం వరకు చేరాలి.

మహిళల ఉపాధికి మరింత ప్రోత్సాహం : గ్రామీణ మహిళలు చెల్లింపు ఆధారిత పనుల్లోకి రావడం పేదరికం తగ్గుదలకు దోహదపడిందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. ఇది ఒక ముఖ్యమైన పరిణామం. మహిళకు స్వంత ఆదాయం రావడం అంటే కుటుంబ ఆర్థిక భద్రత పెరగడం మాత్రమే కాదు.. పిల్లల విద్య, ఆరోగ్యం, పోషణపై ఖర్చు చేసే సామర్థ్యం కూడా పెరగడం.

అందువల్ల మహిళలకు నైపుణ్య శిక్షణ, సురక్షితమైన ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు, రుణ సౌకర్యం, మార్కెట్ అనుసంధానం వంటి అంశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి.

ముద్విన్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- టోర్నమెంట్‌ను ప్రారంభించిన మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్



కడ్తాల్ నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : దీపావళి పండుగను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను కడ్తాల్ మాజీ జడ్పీటీసీ,రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.రిబ్బన్ కట్ చేసి,టాస్ వేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి ముద్విన్ ప్రీమియర్ లీగ్ వంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,పట్టుదల,జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.యువత చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ఇలాంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముద్విన్ గ్రామ సర్పంచ్ సంధ్య వెంకటేష్, ఉపసర్పంచ్ నరసింహ,మాజీ ఉపసర్పంచ్ వినోద్,వార్డు సభ్యులు వెంకటేష్,రమేష్,బీఆర్ఎస్ నాయకులు పొట్టి శీను,గోపాల్, మహేందర్, మహేష్,హరి,రాములు, సురేందర్, క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో నూతన నార్సింగి సర్కిల్ కార్యాలయం ప్రారంభానికి ఏర్పాట్లు



మణికొండ, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఏర్పాటైనప్పటి నుంచి నార్సింగిలో కొనసాగుతున్న నార్సింగి సర్కిల్ కార్యాలయంలో భవన వసతులు, స్థలాభావం కారణంగా అధికారిక కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, మణికొండలో నూతనంగా నిర్మించిన భవనాన్ని సర్కిల్ కార్యాలయంగా వినియోగించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు ఇప్పటివరకు నార్సింగిలో కొనసాగిన సర్కిల్ కార్యాలయ అధికారిక కార్యకలాపాలు రేపటి నుంచి మణికొండలోని నూతన భవనంలో ప్రారంభం కానున్నాయి. సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్ల ప్రజలు ఇకపై తమ అధికారిక పనుల నిమిత్తం మణికొండలోని నూతన కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయ భవనాన్ని మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయనతో పాటు మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుద్దోలు శ్రీరాములు, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు గంగాధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాన్ని ఆర్యవైశ్యులకు కేటాయించాలి



మణికొండ, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానాన్ని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి కేటాయించాలని (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్యులు దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన, పరోపకారం, దానగుణం, సేవాభావం వంటి విశిష్ట లక్షణాలతో సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారని శ్రీధర్ పేర్కొన్నారు. చిన్న కిరాణా దుకాణాల నుంచి పెద్ద వాణిజ్య సంస్థల వరకు వ్యాపార రంగంలో కీలక పాత్ర పోషిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారని తెలిపారు. ఇంతటి సామాజిక ప్రాధాన్యత కలిగిన ఆర్యవైశ్యులకు రాజకీయ రంగంలో తగిన ప్రాతినిధ్యం దక్కకపోవడం విచారకరమన్నారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా కేటాయించలేదని గుర్తుచేశారు. ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు ఇప్పటివరకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం బాధాకరమని అన్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గంలో ఎంతోమంది పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారని, కార్పొరేషన్ ద్వారా వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర ఆర్థిక సహాయాలు అందుతాయని ఆశించినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య హయాంలో ఆర్యవైశ్యులకు సముచిత గుర్తింపు, అవకాశాలు లభించాయని, ఆయన తదనంతరం కాంగ్రెస్ పార్టీలో ఆర్యవైశ్యులకు తగిన రాజకీయ అవకాశాలు కల్పించలేదని పేర్కొన్నారు. కనీసం ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఆర్యవైశ్యుల సామాజిక సేవలను, సమాజ అభివృద్ధికి వారు చేస్తున్న కృషిని గుర్తించి గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాన్ని ఆర్యవైశ్యులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఆర్యవైశ్య మహిళకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బొడ్డు శ్రీధర్ బలంగా కోరారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం!

- చేవెళ్ల ఎమ్మెల్యే,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో రామ్‌లీలా మైదానం సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



శంకర్‌పల్లి, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ,రాజ్యాంగ విలువల కాపాడటం,ఓట్ల దొంగతనాన్ని అరికట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటానికి శంకర్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి.అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు నవంబర్ 1న దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు శంకర్‌పల్లి మున్సిపల్,మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి తమ రాజకీయ నిబద్ధతను చాటుకున్నారు.చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో,శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీలో జరిగిన జైత్రయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నాయి.తెలంగాణ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో పార్టీ జెండాలు చేతబూని,ప్రజాస్వామ్య పరిరక్షణకు అనుకూలంగా నినాదాలు చేస్తూ నాయకులు,కార్యకర్తలు కదంతొక్కారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం,ప్రతి ఓటు విలువను కాపాడటం,ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడం అత్యంత కీలకమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు,ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే విధానాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి, ప్రజల్లో చైతన్యం కల్పించడమే ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఢిల్లీలో నిర్వహించిన ఈ భారీ సభ,ర్యాలీ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పార్శి బాలకృష్ణ, పొడవు శ్రీనివాస్,మోకిలా సర్పంచ్ శేఖర్,టంగుటూరు సర్పంచ్,మోకిలా పీఏసీఎస్ చైర్మన్ సత్యం పాల్గొన్నారు.వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు రఘునందన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,పీఏసీఎస్ డైరెక్టర్ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రశాంత్,భాస్కర్ రెడ్డి,యాదిరెడ్డి,శంకర్ తదితరులు,పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యం.. ప్రజాస్వామ్యమే మార్గం.. ప్రజల హక్కుల కోసం పోరాటమే కాంగ్రెస్ సంకల్పం అంటూ ఢిల్లీ వేదికగా శంకర్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు తమ గళాన్ని వినిపించాయి.

డ్రైనేజీ,మంచినీటి సమస్యలపై సీపీఎం పోరాటం

- హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్.



అడ్డగుట్ట, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేష్ పిలుపునిచ్చారు. సీపీఎం సికింద్రాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అడ్డగుట్ట కార్యాలయంలో పార్టీ సభ్యులు, సానుభూతిపరులతో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ స్థానిక సమస్యలపై నవంబర్ 1 నుండి నవంబర్ 30 వరకు క్షేత్రస్థాయిలో పాదయాత్రలు చేయాలని,కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, కార్మిక హక్కులపై దాడులు సామాన్య ప్రజల జీవితాలను ప్రభావితం తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అడ్డగుట్ట ప్రాంతంలో రోడ్లపై డ్రైనేజీ పారడం, మంచినీటి సమస్య, రోడ్లు గుంతల మయమవ్వడడడం, పింఛన్ల సమస్య, ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూమ్ లు రాకపోవడం తదితర అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మూడు కోట్ల బడ్జెట్ రిలీజై ఆరు సంవత్సరాలు గడుస్తున్న పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పేదలకు ఇళ్లు, యువతకు ఉద్యోగాలు, కార్మికులకు ఉపాధి భద్రత, ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యపరుస్తూ పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఆర్ మల్లేష్ నాయకులు టీ.మహేందర్, బాలయ్య, ఎల్లయ్య, శారద, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చల్లంపల్లిలో శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యాగం

- ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో ఐక్యత, సోదరభావం
- యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



కడ్తాల్ నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : ఆధ్యాత్మిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రజల్లో భక్తిభావం,ఐక్యతను పెంపొందిస్తాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామంలో మంతపురం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యాగానికి ఆదివారం ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

- ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాలి

ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ..భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు దేశ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు.శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యాగం వంటి పవిత్ర కార్యక్రమాలు లోకకల్యాణం,ప్రజల ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలను ఆకాంక్షిస్తూ నిర్వహించడం విశేషమన్నారు.ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యత,సోదరభావం,సామాజిక సమైక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం యాగ నిర్వాహకుడు మంతపురం చంద్రశేఖర్‌ను అభినందిస్తూ, గ్రామంలో ఇంతటి పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ డాక్టర్ బమ్మిడిపాటి రవికృష్ణ శర్మ,వేద పండితులు,గ్రామ పెద్దలు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా తిరుపతి రెడ్డి,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు,నరేందర్ గౌడ్,తల్లోజు రఘు,గుర్క శివ తదితరులు పాల్గొన్నారు.

ముద్విన్ ఆలయానికి అండగా సుంకిరెడ్డి

- భక్తుల సౌకర్యార్థం రూ.2లక్షల విరాళం



కడ్తాల్ నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు.ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్ నిర్మాణం చేపట్టేందుకు ఈ విరాళాన్ని అందజేశారు.ఆలయాన్ని సందర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు ఆలయ అభివృద్ధి పనుల గురించి వివరించారు.నిత్యం ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పండుగలు,ప్రత్యేక పూజల సమయంలో భక్తులకు నీడ కల్పించేందుకు రేకుల షెడ్ నిర్మాణం అవసరమని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన వెంటనే రూ.2 లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు ప్రజల విశ్వాసానికి,ఆధ్యాత్మిక జీవనానికి ప్రతీకలని అన్నారు.ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు సహకారం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు.ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ..రేకుల షెడ్ నిర్మాణానికి ఆర్థిక సహాయం కోరిన వెంటనే స్పందించి రూ.2 లక్షలు అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సహాయం ఆలయానికి వచ్చే భక్తులకు, ముఖ్యంగా పర్వదినాల్లో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.గ్రామస్తులు సైతం ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొగాకు సంధ్య వెంకటేష్,వార్డు సభ్యులు ఈర్లపల్లి మల్లేష్,రాశిక శ్రీను,మంకాల శ్రీను,సంధూరి కృష్ణ,సీనియర్ నాయకులు కావటి జంగయ్య యాదవ్,జంగం శ్రీను,పొగాకు వినోద్, నక్కపోతు మధు,ఏదుల వెంకటేష్,నురేష్, సైదులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మగడ్డ తండాలో తుల్జా భవాని ఆలయానికి కడప,ద్వార ప్రతిష్ఠాపన

- అమ్మవారి ఆశీస్సుల కోసం ప్రత్యేక కార్యక్రమం
- తండా ప్రజల సమక్షంలో అన్నప్రసాద వితరణ



కడ్తాల్ నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలోని గనుగు మర్ల తండా గ్రామానికి చెందిన పోచమ్మగడ్డ తండాలో తుల్జా భవాని అమ్మవారి ఆలయానికి కడప, ద్వారాన్ని నిలబెట్టే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,గిరిజన సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు హనుమ నాయక్,సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,కడ్తాల్ మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు జర్పుల లక్పతి నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.తండా ప్రజల సమక్షంలో అమ్మవారికి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఆలయ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు రాయికంటి బిక్షపతి,శారదా బిక్కు నాయక్,సేవాలాల్ సేన రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజు నాయక్,వార్డు సభ్యుడు రాజు నాయక్,మాజీ వార్డు సభ్యురాలు రాణి జగన్ నాయక్, నాయకులు టీక్ లాల్ నాయక్,దేశ్య నాయక్,కిషన్ నాయక్,పాండు నాయక్,బాలు నాయక్, రాజేందర్ నాయక్,వికాస్,రాకేష్,వెంకటేష్,గోపి,యువకులు,తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం

- కడ్తాల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి
- మండల కేంద్రంలో ధర్నా..ఎమ్మార్వో ఆఫీసు వద్ద నిరసన
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్



కడ్తాల్ నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లాలో కడ్తాల్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు (సోమవారం,నవంబర్ 02) ఉదయం 10 గంటలకు కడ్తాల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ కడ్తాల్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ ప్రకటించారు.రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.కడ్తాల్ మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నివాసంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.కరువు పరిస్థితులతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ధర్నా అనంతరం కడ్తాల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు.

- రైతులంతా తరలిరావాలి

కడ్తాల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి,నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో బీఆర్ఎస్ తాజా,మాజీ ప్రజాప్రతినిధులు,మండలంలోని వివిధ గ్రామాల రైతులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కంబాల పరమేష్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్,కడ్తాల్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణ,మండల నాయకుడు జోగు వీరయ్య,కడ్తాల్ మండల యువజన విభాగం అధ్యక్షుడు కంబాలపల్లి అంజి,కోట్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిపల్లిలో ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- వాల్మీకి మహర్షి ఆశయాలను కొనసాగించాలి : అర్థ సుధాకర్ రెడ్డి



వికారాబాద్, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ పట్టణంలోని 10వ వార్డు అనంతగిరిపల్లిలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్థ సుధాకర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆదికావ్యమైన రామాయణాన్ని రచించి సమాజానికి ధర్మమార్గాన్ని చూపిన మహర్షి వాల్మీకి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, నందు, బోయ బాలరాజు, కురువ శీను, బాబు నాయక్, మోహన్ నాయక్, నర్సింలు, వార్డు ప్రజలు, వాల్మీకి సంఘం యువత, పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 28న నవోదయ ప్రవేశ పరీక్ష

- హాల్‌టికెట్లు విడుదల.. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి

కీసర, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈనెల 28న ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో జరగనుంది. ఈ విషయాన్ని కీసర నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ కె. మాధవరావు తెలిపారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారిక వెబ్‌సైట్ https://cbseitms.rcil.gov.in/nvs/ ద్వారా హాల్‌టికెట్లు పొందాలని ఆయన కోరారు.

ట్రెజరీ శాఖలో 36 సంవత్సరాల విశిష్ట సేవలందించిన మన్నెపల్లి వెంకటేశ్వరరావు (కామ్రేడ్)మృతి తీరని లోటు

- తెలంగాణ ఉద్యమాలు క్రియాశీలక పాత్ర
- ఏలూరి శ్రీనివాసరావు



ఖమ్మం, నవంబరు 2(జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మం ట్రెజరీ శాఖలో సుమారు 36 సంవత్సరాల పాటు సుదీర్ఘమైన, విశిష్టమైన సేవలందించి, సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందిన ఆప్తులు మన్నెపల్లి వెంకటేశ్వరరావు గుండెపోటుతో అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు, టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు.ఈ సందర్భంగా వారి పార్థివ దేహానికి ఏలూరి శ్రీనివాసరావు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, కార్యవర్గ సభ్యులు, టీఎన్జీవో అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాసరావు, మల్లెల రవీంద్ర ప్రసాద్, గంగవరపు నరేంద్ర, తాళ్లూరు శ్రీకాంత్, పెద్దినేని రాధాకృష్ణ, శ్రీనివాసరావు, ట్రెజరీ శాఖ నుండి వి సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, ఎన్ వి కృష్ణారావు, ఎస్కే ఖాజామియా, విఠల్ రెడ్డి, ఎమ్ వెంకటేశ్వర్, ఉమామహేశ్వరరావు, బానోత్ దస్రు, ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రామ్మూర్తి, కృష్ణకుమారి, రాజా సాహెబ్, రవిచంద్ర, ప్రవీణ్, సౌజన్య, జ్యోతి తదితరులు, ఖమ్మం జిల్లా రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నుండి సుబ్బయ్య వై వెంకటేశ్వర్లు (వై వి), వేణు, రమణ యాదవ్, కల్యాణ నాగేశ్వరావు, రవికుమార్, పి.పుల్లయ్య, రవికుమార్, జిల్లా నాయకులు, ట్రెజరీ శాఖ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొని మన్నెపల్లి వెంకటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మన్నెపల్లి వెంకటేశ్వరరావు ట్రెజరీ శాఖలో 36 సంవత్సరాల పాటు అంకితభావంతో, నిబద్ధతతో పనిచేసి ఉద్యోగ వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలు, ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల చెల్లింపులు వంటి కీలకమైన బాధ్యతలు నిర్వహించే ట్రెజరీ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేస్తూ, తన విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలనకు ప్రాధాన్యతనిచ్చారని కొనియాడారు. అధికారిగా మాత్రమే కాకుండా సహచర ఉద్యోగులకు ఆప్తుడిగా, స్నేహశీలిగా, ఆపదలో అండగా నిలిచే వ్యక్తిగా ఆయన అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, సహచరులతో ఆత్మీయ సంబంధాలను కొనసాగించేవారని గుర్తుచేసుకున్నారు.ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వెంకటేశ్వరరావు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, సకల జనుల సమ్మెతో పాటు ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక ఉద్యమ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఖమ్మం జిల్లాలో జరిగిన ఉద్యమ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొని, ఉద్యమ నాయకుడిగా మంచి గుర్తింపు సంపాదించుకున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన చేసిన సేవలు, ఉద్యోగుల హక్కుల సాధన కోసం చూపిన చొరవ ఎప్పటికీ స్మరణీయమని పేర్కొన్నారు.36 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో ఎన్నో సేవలందించి, ఉద్యోగుల ఉద్యమాల్లోనూ తనదైన ముద్ర వేసిన ఒక మంచి సహచరుడిని, ఉద్యమ స్ఫూర్తి కలిగిన నాయకుడిని కోల్పోవడం ఉద్యోగ లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.వారి అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

నర్సాడ-షాబాద్ రహదారిని ఫోర్న్ చేయాలని సర్పంచుల పాదయాత్ర.



రాజేంద్రనగర్, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : నర్సాడ నుంచి షాబాద్ వరకు రహదారిని ఫోర్న్ విస్తరించాలని డిమాండ్ చేస్తూ రామంజపూర్,మల్కారం,కాచారం,నానాజీపూర్ సర్పంచులు పాదయాత్ర చేపట్టారు.ఇరుకైన రహదారితో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కోరారు.లేనిపక్షంలో ప్రజలతో కలిసి భారీ ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కిష్టారం గ్రామ పంచాయతీలో గ్రాడ్యుయేట్ MLC ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన.



ఇల్లందు, (జర్నలిస్ట్ ఫైల్) : కిష్టారం గ్రామ పంచాయతీ నందు సర్పంచ్ కోర్స. రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ MLC ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని నేడు ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్ స్వయంగా పరిశీలించి, ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేస్తూ విలువైన సందేశాన్ని అందించారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ MLC ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వైద్యులు, ఆసుపత్రులపై అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు : ఐఎంఏ ఖమ్మం జిల్లా శాఖ హెచ్చరిక



ఖమ్మం, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం వైద్యులు , ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు , నిరాధార ఆరోపణలు , బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ , సివిల్ , పరువునష్టం కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఖమ్మం జిల్లా శాఖ హెచ్చరించింది . ఈ మేరకు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని అన్నారు . వైద్య నిర్లక్ష్యం నిర్ధారణ కాకముందే ఆరోపణలు చేయడం , ఆసుపత్రుల్లో గొడవలు సృష్టించడం , సిబ్బందిని బెదిరించడం , సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం ఆందోళనకరమన్నారు . ఇలాంటి ఘటనల వల్ల అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు . వైద్యులు , సిబ్బంది , ఆసుపత్రులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ , డీఎంహెచ్ఓ , ఏసీపీలకు ఐఎంఏ ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు . ఐఎంఏ లీగల్ సెల్ , జిల్లా కార్యదర్శి డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ, వైద్యులపై అసత్య ఆరోపణలు , బెదిరింపులు , పరువుకు భంగం కలిగించే ప్రచారాలపై ఇకపై చట్టపరంగా పోరాడతామని వెల్లడించారు . బాధిత వైద్యులు , ఆసుపత్రులకు లీగల్ సెల్ ద్వారా పూర్తి న్యాయ సహకారం అందిస్తామని తెలిపారు . వైద్య సేవలపై రోగులకు అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులను , వైద్య నియంత్రణ సంస్థలను లేదా న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కు ఉందని , నిజమైన ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణకు ఐఎంఏ సహకరిస్తుందని స్పష్టం చేశారు .

మెర్క్యూరీ ఈవీ టెక్ లిమిటెడ్ నూతన షోరూమ్‌ను ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





ఎల్బీనగర్, నవంబరు2 (జర్నలిస్ట్ ఫైల్) : ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని విరాట్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ గణేష్ మోటార్స్ – మెర్క్యూరీ ఈవీ టెక్ లిమిటెడ్ నూతన షోరూమ్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమానికి ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మెర్క్యూరీ ఈవీ టెక్ లిమిటెడ్ వ్యవస్థాపకులు డాక్టర్ జయేష్ ఠక్కర్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు మరియు భవిష్యత్తులో కాలుష్య రహిత రవాణా వ్యవస్థ అభివృద్ధికి ఇటువంటి సంస్థలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి డి. శ్రీనివాస్ రంగేశ్వరి ఆహ్వానించగా, విఆర్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ మేనేజింగ్ పార్టనర్‌గా వ్యవహరించారు.

బుర్హాన పురం డివిజన్ గంగపుత్ర కమిటీ ఏకగ్రీవం

- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ విజయ వెంకటరమణ



ఖమ్మం, నవంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగరం బురానుపురం డివిజన్ గంగపుత్ర నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు కన్నం ప్రసన్న కృష్ణ, నగర అధ్యక్షులు కేటి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి 44వ డివిజన్ మాజీ తాజా కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ హాజరై పలు సూచనలు చేశారు. నూతన కమిటీ గంగపుత్ర సంఘం అభివృద్ధితో పాటు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షుడిగా బిజ్జుల శంకరయ్య, కార్యదర్శిగా పెద్దపల్లి సుధాకర్, కోశాధికారిగా డొల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పెద్దవెల్లి సోమయ్య, పాకాల ఉపేందర్ వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.సమావేశంలో గంగపుత్రులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా గంగపుత్రుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తీర్మానించారు. గంగపుత్రుల సంక్షేమానికి అవసరమైన ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.ముదిరాజులను బీసీ-ఏ జాబితాలో చేర్చాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సామాజిక న్యాయం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గంగపుత్ర సంఘం ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు యువత, మహిళలకు సంఘంలో సముచిత ప్రాధాన్యత కల్పించాలని నాయకులు ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని, గంగపుత్రుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో యువజన సంఘం అధ్యక్షుడు గుంటి కుమారస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు పెద్దపల్లి కళావతి తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

కేటీఆర్ కు అపూర్వ స్వాగతం

- భారీ బైక్ ర్యాలీతో కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్ కు స్వాగత కార్యక్రమం సక్సెస్ పట్ల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి హర్షం





నిజామాబాద్, నవంబరు 2 (జర్నలిస్ట్ ఫైల్) : ఆదిలాబాద్ రైతు గర్జన సభకు వెళ్తూ మార్గమధ్యంలో ఆర్మూర్ పట్టణానికి చేరుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు పార్టీ జిల్లా అధ్యక్షుడు,ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి భారీ సంఖ్యలో పార్టీ నేతలు,కార్యకర్తలతో కలిసి ఘనస్వాగతం పలికారు.ఆర్మూర్ నియోజకవర్గం నలుమూలలతో పాటు పట్టణం నుంచి పెద్ద ఎత్తున కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు జీవన్ రెడ్డి నాయకత్వంలో ఆర్మూర్ బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్నారు.కాసేపటికే కేటీఆర్ వాహనశ్రేణి ఆర్మూర్ బైపాస్ రోడ్డు వద్దకు రాగానే కేటీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి,వచ్చేది కేసీఆర్ రాజ్యమే అని నినదించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డితో పార్టీ నేతలు కేటీఆర్ ను గజమాలతో సత్కరించి ఆయనకుఅపూర్వ స్వాగతం పలికారు.అక్కడి నుంచి పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీతో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు.అనంతరం లంచ్ చేసిన తర్వాత కేటీఆర్ అక్కడి నుంచి ఆదిలాబాద్ రైతు గర్జన సభలో పాల్గొనేందుకు వెళ్లారు.కేటీఆర్ కు ఘన స్వాగతం పలికే క్రమంలో ఆర్మూర్ పట్టణమంతా గులాబీమయమైంది.గులాబీ రంగు జెండాలు,ప్లెక్సీలతో పట్టణాన్ని అలంకరించారు.కేటీఆర్ కొద్దిసేపు ఆగినా అదిఆర్మూర్ గులాబీ ఆర్మీ లో నయా జోష్ నింపింది.తన నాయకత్వంలో కేటీఆర్ కు స్వాగత కార్యక్రమం సక్సెస్ కావడంతో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేయడమే కాక పార్టీ శ్రేణుల నిబద్ధతను అభినందించారు

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు



- విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు
- గుంపులుగా గుమిగూడితే చర్యలు
- గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని, పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు.

కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బందిని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ప్రజలు గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఘర్షణలు, అల్లర్లు జరగకుండా అదనపు బలగాలను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో అల్లర్లకు పాల్పడినవారు, రౌడీషీటర్లు, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై ముందస్తు నిఘా ఉంచాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున విధులకు హాజరయ్యే పోలీసు సిబ్బంది రెయిన్‌కోట్లు వెంట తీసుకురావాలని, ప్రతికూల వాతావరణంలోనూ సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- మూడంచెల భద్రతా వ్యవస్థ..కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా
- జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ వెల్లడి



కడప (జర్నలిస్ట్ ఫైల్):నేడు జరగనున్న మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ కౌంటింగ్ కు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్.పి ఓ ప్రకటన లో తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఐఖీఙ (డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్) లతో తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణా సంచా కాల్చడం నిషేధించడం జరిగిందన్నారు. గెలిచిన అభ్యర్థులు ఓటమి చెందిన అభ్యర్థులు సంయమనం పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించిన ఏజెంట్లు అభ్యర్థులు మాత్రమే పంపించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్లు అభ్యర్థులు(క్యాండిడేట్స్) ఎన్నికల నియమావళి ఆదేశాలను పాటించాలన్నారు. కౌంటింగ్ జరిగే రోజు జిల్లాలో ఎక్కడా మద్యం విక్రయించకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద 30 పోలీసు Act , సెక్షన్ 163 దీఙూ అమలులో ఉన్నందున ఎవరూ గుంపులుగా ఉండకూడదని హెచ్చరించారు. ఏటువంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు.

ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయడం గాని కవ్వింపు చర్యలకు గాని పాల్పడరాదన్నారు.

కృష్ణా తీర ప్రాంత గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

- శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దు
- వాగులు, వంకలు, నదులు దాటువద్దు, చేపలు పట్టుటకు వెళ్ళరాదు



గుంటూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): "మురసు" తుఫాన్ ప్రభావంతో పులిచింతల నుండి ప్రకాశం బ్యారేజీకి ఎక్కువ వరద వచ్చే అవకాశం ఉందని, ఆ నీటిని కిందకు వదలడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సియం.సాయికాంత్ వర్మ తెలిపారు. ప్రకాశం బ్యారేజీ నుండి వరద వచ్చే అవకాశం ఉన్నందున మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో గల

కృష్ణా తీర ప్రాంత గ్రామాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లంక గ్రామల ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమ జిల్లా మండల ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 ఫోన్ నంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. మండల స్థాయి కార్యాలయం వరకు కంట్రోల్ రూమ్ లు 24 గంటలు పనిచేయాలని చెప్పారు. మండలాల్లో అన్ని కోణాల్లో సమీక్షించుకోవాలని, ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, అందులో ఎవరు నివసించరాదని విజ్ఞప్తి చేశారు. చెరువులు, వాగులు, వంకల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, దాటుటకు ప్రయత్నించవద్దని కోరారు. తడిగా ఉన్న కరెంటు స్తంభాలను ముట్ట వద్దని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. 20 నుండి 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావచ్చని చెప్పారు.

లోతట్టు ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జలవనరుల శాఖ ప్రతీ గంటకు నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ వాగు, కాలువల పర్యవేక్షణకు ఒక్కొక్కరిని నియమించాలన్నారు. పరిస్థితిని అనుసరించి తక్షణం ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పూర్తి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వివిధ వాగుల ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు. ఎక్కడైతే గట్లు బలహీనంగా ఉన్నాయో వాటిని గుర్తించాలని, అటువంటి చోట్ల ఇసుక బస్తాలు సిద్ధం వేయాలని ఆదేశించారు. గాలులకు హోర్డింగులు, చెట్లు కూలిపోయే పరిస్థితి ఉంటుందని, అర్నాబ్ తుఫాన్ లో తొలగించామని, మరోసారి తనిఖీ చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య తలెత్త రాదని అన్నారు. తాగునీటి పథకాలు వద్ద జనరేటర్లు సిద్ధంగా పెట్టుకోవాలని ఆదేశించారు. త్రాగునీరు ఎటువంటి పరిస్థితుల్లో కలుషితం కాకుండా స్పష్టమైన పర్యవేక్షణ జరగాలని అన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వలన రవాణాకు ఆటంకం జరక్కుండా ట్రీ కట్టర్స్, పవర్ సాస్ లను సిద్ధంగా పెట్టాలని రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. విపత్తు నిర్వహణ శాఖ అన్ని పరికరాలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. విద్యుత్తు స్తంభాలు కూలితే వెంటనే పునరుద్ధరణ చేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని బంకుల్లో ఇంధనం పూర్తిస్థాయిలో ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. టెలికాం, మొబైల్ సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సంబంధిత టెలికం కంపెనీలు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకులు పూర్తిస్థాయిలో అందుబాటులో పెట్టాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద ఆహార తయారీ కోసం ఏజెన్సీలను సిద్ధం చేసి తక్షణ ఆహార పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ పట్ల రైతులను అప్రమత్తం చేయాలని అవసరమైన సూచనలు సలహాలను అందించాలని వ్యవసాయ ఉద్యానవన శాఖలను ఆదేశించారు. పశువులకు సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వాటికి తగిన ఆహారము అందే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడ మనుషుల ప్రాణాలు గానీ, పశువుల ప్రాణాలు గానీ, ఆస్తుల నష్టంగాని జరగరాదని స్పష్టం చేశారు.

ఆసుపత్రుల వద్ద విద్యుత్ ఆటంకం లేకుండా చూడాలి

ఆసుపత్రుల వద్ద ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్ల వద్ద ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. హై రిస్క్ లో ఉన్న గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. వైద్య సేవలకు ఎటువంటి అంతరాయము ఉండరాదని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, అధికారులు పాల్గొన్నారు.

ఏకగ్రీవాలపై జగన్ నీతులా ? : ఎమ్మెల్యే నసీర్

- మీ హయాంలో ఏకగ్రీవాలు ప్రజాభిప్రాయమా ?
- ఇప్పుడు అంతా అనైతికమా ?
- ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేస్తే నచ్చదా ?
- మైనారిటీల ఏకగ్రీవాలపై గగ్గోలు ఎందుకు ?
- జగన్ రాష్ట్రానికి రాంబదులా మారాడు



గుంటూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్):స్థానిక సంస్థల ఎన్నికల వేళ పులివెందులతో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడం జగన్ కు మింగుడు పడటం లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జగన్ కు ఇష్టం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజల ఆమోదంతోనే ఏకగ్రీవాలు జరుగుతాయని చెప్పిన జగన్.. ఇప్పుడు ఏకగ్రీవాలపై గగ్గోలు పెడుతుంటే జనం నవ్వుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల్లో ప్రజలకు అక్కడ పరిస్థితులకు అనుగుణంగా నాయకులను ఎన్నుకుంటారని, కానీ జగన్ ఏకగ్రీవాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరఫున అభ్యర్థులను ఎంపిక చేయక ముందే ఏకగ్రీవాలపై రెచ్చగొట్టేలా జగన్ వ్యవహరించారని చెప్పారు. పుంగనూరు, రాయచోటి, పులివెందుల వంటి ప్రాంతాల్లో ముస్లిం మైనారిటీలు బలంగా ఉన్నారని, ఆయా ప్రాంతాల్లో జగన్ ఎన్నికలు అడ్డుకుకోవాలని చూశారన్నారు. పుంగనూరు, రాయచోటి, నంద్యాల, పిడుగురాళ్ల వంటి ప్రాంతాల్లో మైనారిటీలు ఏకగ్రీవమయ్యారని, మైనారిటీల వ్యతిరేకి జగన్ అని అన్నారు. రాష్ట్రానికి జగన్ రాబందులా తయారయ్యారని విమర్శించారు. రానున్న ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసి జగన్ కు బుద్ధి చెబుతారని చెప్పారు.

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- 50 హాళ్లలో 468 టేబుళ్లు.. 1,404 మంది సిబ్బంది నియామకం



గుంటూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నగర కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె.మయూర్ అశోక్ తెలిపారు. మంగళవారం జరగనున్న కౌంటింగ్‌ను పారదర్శకంగా, వేగవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని నిర్దేశిత భవనాల్లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆయన ఎన్నికల పరిశీలకుడు వి.వీర బ్రహ్మయ్యతో కలిసి కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.

నగరంలోని 76 వార్డుల పరిధిలోని 596 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కించేందుకు 50 హాళ్లలో 468 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. లెక్కింపు విధుల కోసం శిక్షణ పొందిన 1,404 మంది సిబ్బంది, అధికారులు నియమితులయ్యారు. అభ్యర్థులు, వారి అధికారిక ఏజెంట్లు మంగళవారం ఉదయం 6 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు చేరుకోవాలని సూచించారు. వారి సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీల్స్ తెరిచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, లోపలికి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది తమ మొబైల్ ఫోన్లను భద్రపరుచుకునేందుకు కేంద్రాల వెలుపల ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది, అధికారుల కోసం తాగునీరు, అల్పాహారం, భోజన వసతులతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల నిబంధనలకు లోబడి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, వేగంగా పూర్తయ్యేందుకు అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది సహకరించాలని కమిషనర్ మయూర్ అశోక్ కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మురసు తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి

- పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు

గుంటూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాను నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, డీఎస్పీ స్థాయి అధికారులతో సోమవారం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై సూచనలు చేశారు. తుఫాను ప్రభావం సాయంత్రం నుంచి మరుసటి సాయంత్రం వరకు ఉండే అవకాశం ఉన్నందున గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తుఫాను సహాయక చర్యల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అవసరమైన జేసీబీలు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వాగులు, వంకలు, వంతెనల వద్ద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

జాతీయ రహదారులపై భారీ వాహనాలను అవసరమైన సందర్భాల్లో సురక్షిత ప్రాంతాల్లో నిలిపేందుకు ముందుగానే ప్రదేశాలను గుర్తించాలని ఆదేశించారు. సుమారు ప్రతి 15 కిలోమీటర్లకు ఒక వాహనాల నిలుపుదల ప్రాంతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు తుఫాను జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు పబ్లిక్ అడ్రస్ వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలని, తుఫాను ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు.

రెవెన్యూ, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రతి మూడు, నాలుగు గ్రామాలకు ఒక కానిస్టేబుల్‌ను నియమించి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడమే లక్ష్యంగా తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల మూడవ రాండమైజేషన్ పూర్తి



గుంటూరు , నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల సిబ్బంది మూడవ రాండమైజేషన్ సోమవారం పూర్తి అయింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు. రాండమైజేషన్ ప్రక్రియను జడ్పిటిసి రిటర్నింగ్ అధికారి మరియు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి మోహన రాగిని పాల్గొన్నారు.

మురుసు తుఫాను ప్రభావం... నేడు పాఠశాలలకు సెలవు

గుంటూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): మురుసు తుఫాను నేపథ్యంలో గుంటూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు నవంబర్ 3న సెలవు ప్రకటించారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ సమాచారాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆదేశించారు. పాఠశాలలకు సెలవు విషయాన్ని ముందుగానే విద్యార్థులకు, తల్లిదండ్రులకు చేరవేసి ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

తుఫాను పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలను ఉల్లంఘించరాదని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు, బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు..!

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి
- జిల్లాలో ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 172 వార్డులకు ఓట్ల లెక్కింపు
- ఓట్ల లెక్కింపునకు 18 రూములు, 159 టేబుళ్లు ఏర్పాటు



కడప(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

మంగళవారం ఉదయం జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 172 వార్డులకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అవసరమైన గదులు కౌంటింగ్ టేబుళ్లు కౌంటింగ్ సిబ్బంది ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేసినట్లు వివరించారు.

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి మొత్తం 2,82,176 మేయర్, చైర్‌పర్సన్ ఓట్లు, 1,13,348 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు చేపట్టాల్సి ఉందని తెలిపారు. మేయర్, చైర్‌పర్సన్ ఓట్ల లెక్కింపునకు ఐదు గదుల్లో 84 టేబుళ్లను ఏర్పాటు చేశామని, దీనికి సంబంధించి మొత్తం 12 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

అదేవిధంగా వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు 13 గదుల్లో 75 టేబుళ్లను ఏర్పాటు చేశామని, మొత్తం 36 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

మున్సిపాలిటీల వారీగా లెక్కింపు ఏర్పాట్లు:

బద్వేలు పట్టణానికి సంబంధించి 1,320 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో ఒక గది, ఒక టేబుల్ ఏర్పాటు చేసి రెండు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

జమ్మలమడుగు పట్టణంలో 32 వార్డులకు సంబంధించి మేయర్, చైర్‌పర్సన్ ఓట్ల లెక్కింపునకు 30,206 ఓట్లు ఉండగా, ఒక గదిలో ఎనిమిది టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యుల 26,560 ఓట్ల లెక్కింపునకు రెండు గదుల్లో 16 టేబుల్స్ ఏర్పాటు చేసి రెండు విడతల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), ముద్దనూరు రోడ్డును లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కడప నగరపాలక సంస్థ పరిధిలో 66 వార్డులకు సంబంధించి మేయర్ ఓట్ల లెక్కింపునకు 2,13,488 ఓట్లు ఉండగా, మూడు గదుల్లో 66 టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యుల 42,640 ఓట్ల లెక్కింపునకు ఒక గదిలో 14 టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఇందుకు ఎంఎస్ఎన్‌యూ పాలిటెక్నిక్ కళాశాలను లెక్కింపు కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

మైదుకూరు పట్టణంలో 15 వార్డులకు సంబంధించి 12,491 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఒక గది, 16 టేబుల్లను ఏర్పాటు చేసి 13 విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

పులివెందుల పట్టణంలో 40 వార్డులకు సంబంధించి మేయర్ చైర్‌పర్సన్ ఓట్ల లెక్కింపునకు 38,482 ఓట్లు ఉండగా ఒక గదిలో 10 టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యుల 18,566 ఓట్ల లెక్కింపునకు ఒక గదిలో 10 టేబుల్లను ఏర్పాటు చేసి రెండు విడతల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను.. ముద్దనూరు రోడ్డులోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాజంపేట పట్టణంలో 17 వార్డులకు సంబంధించి 11,065 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు జెడ్పీ ఉన్నత పాఠశాల, మన్నూరు వద్ద ఆరు గదుల్లో 17 టేబుల్లను ఏర్పాటు చేసి 12 విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు వివరించారు.

ఎర్రగుంట్ల పట్టణంలో ఒక వార్డుకు సంబంధించి 706 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు ముద్దనూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఒక గది ఒక టేబుల్ ఏర్పాటు చేసి ఒక విడతలో లెక్కింపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత...

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఎంట్రీ కంట్రోలింగ్, ఐడి తనిఖీలు, అవసరమైన బారికేడ్ల ఏర్పాటు వంటి చర్యలను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు నిరంతర నిఘా కొనసాగించేలా సంబంధిత పోలీసు యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపట్టామన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ఆరు నెలల్లో 12వ పీఆర్సీ నివేదిక ఇవ్వాలి



○ పీఆర్సీ కమిషనర్‌కు ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి

విజయవాడ, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): 12వ పీఆర్సీ నివేదికను ఆరు నెలల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఏపీ జేఏసీ అమరావతి కోరింది. పీఆర్సీ నియామకంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని, మరింత ఆలస్యం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. ఈ మేరకు సంఘం చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తదితరులు పీఆర్సీ కమిషనర్ దినేష్ కుమార్‌ను సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ విధానాలు, ఇప్పటికే అందుబాటులో ఉన్న ఉద్యోగుల సమాచారాన్ని వినియోగిస్తే నివేదికను త్వరితగతిన సిద్ధం చేయవచ్చని నాయకులు తెలిపారు.

ఉద్యోగ సంఘాలు తమ ప్రతిపాదనలు, అవసరమైన సమాచారాన్ని సత్వరమే అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. నిర్ణీత ఏడాది గడువులో కాకుండా ఆరు నెలల్లోనే నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెరుగుతున్న నిత్యావసరాలు, విద్య, వైద్యం, గృహ నిర్వహణ ఖర్చులతో ప్రస్తుత వేతనాలతో కుటుంబాలను నిర్వహించడం ఉద్యోగులకు భారంగా మారిందన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు ఇంకా పూర్తిగా చెల్లించలేదని, తక్కువ పెన్షన్లతో పెన్షనర్లు, చాలీచాలని వేతనాలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ జాప్యం వల్ల పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపైనా ప్రభావం పడుతోందన్నారు.

పీఆర్సీ కేవలం వేతనాల పెంపు అంశం కాదని, ఉద్యోగుల ఆర్థిక భద్రత, కుటుంబ సంక్షేమం, ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న అంశమని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను త్వరితగతిన సేకరించి, డిజిటల్ విధానంలో సమాచారాన్ని విశ్లేషించి ఆరు నెలల్లో నివేదిక సమర్పించాలని పీఆర్సీ కమిషనర్‌ను కోరారు.

పోలింగ్ మరుసటి రోజు ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలి

○ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి

విజయవాడ, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి పోలింగ్ మరుసటి రోజు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సామల సింహాచలం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ విధుల కోసం నవంబర్ 4, 5 తేదీల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ 5వ తేదీన ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులను పంపిణీ, స్వీకరణ కేంద్రాల్లో అప్పగించే ప్రక్రియకు చాలా సమయం పడుతుందని, ఒక్కోసారి రాత్రంతా అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో శారీరక, మానసికంగా అలసిపోయిన ఉపాధ్యాయులు మరుసటి రోజు ఉదయమే పాఠశాల విధులకు హాజరుకావడం ఇబ్బందికరంగా మారుతుందని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు చేరుకోవడానికి రవాణా సమస్యలు కూడా ఎదురవుతున్నాయని, విశ్రాంతి లేకుండా విధులకు హాజరైతే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులు క్షేమం..



నెల్లూరు, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): కావలి నియోజకవర్గం జువ్వలదిన్నె సమీప సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు ఇంజన్ చెడిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల తెలిపారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు సమన్వయంతో అప్రమత్తంగా చేపట్టిన రక్షణ చర్యలతో బోటును సోమవారం సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో పాటు అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా రక్షించినట్లు వెల్లడించారు.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు నెల్లూరు సముద్ర తీర ప్రాంతానికి చేరుకున్న సమయంలో సముద్రంలో వాతావరణ మార్పులను గమనించి తిరిగి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యలో బోటు ఇంజన్ చెడిపోవడంతో హార్బర్ మౌత్ పాయింట్‌కు సుమారు అర కిలోమీటరు దూరాన లంగరు వేసుకుని సముద్రంలోనే నిలిచిపోయారు. ఈ విషయాన్ని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో విధులు నిర్వహిస్తున్న సర్వైలెన్స్ సిబ్బంది గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై స్థానిక మత్స్యకారుల సహకారంతో రక్షణ చర్యలు ప్రారంభించారు. సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉండటంతో తొలుత బోటు వద్దకు చేరుకోవడం కష్టతరమైంది.

ఈ క్రమంలో బోటుకు వేసిన లంగరు తెగిపోవడంతో సముద్ర అలల ఉధృతికి బోటు పాతకడపాలెం గ్రామం వైపు కొట్టుకుపోయింది. అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో బోటును అనుసరిస్తూ రక్షణ చర్యలను కొనసాగించారు.

చివరకు బోటును పాతకడపాలెం సముద్ర తీరానికి సురక్షితంగా చేర్చి అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

కూటమికి ఓటేయండి..అభివృద్ధిలో భాగస్వామ్యులు కండి : మంత్రి దుర్గేష్

○ కడియం మండలంలోనూ, పొట్టిలంకలో ప్రచార రథంపై పర్యటించి కూటమి బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించిన మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరంనవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి ఓటేసి అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కడియం మండలంలో మరియు పొట్టిలంకలో మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిలు కూటమి అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారం నిర్వహించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందుప్రచార రథంపై తిరుగుతూ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కూటమి అభ్యర్థిగా కడియం మండల జెడ్పీటీసీ గా పోటీ చేస్తున్న రత్నం మహేశ్వరి(అయ్యప్ప)(జనసేన), పొట్టిలంకలో ఎంపీటీసీ అభ్యర్థి సతీష్(జనసేన)తరపున ఎన్నికల ప్రచారం చేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌కు ప్రజలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.. స్థానికంగా ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ...గత వైసీపీ ప్రభుత్వం చేయని పనులను కూటమి ప్రభుత్వం చేసి రెండన్నరేళ్ల కాలంలో చేసి చూపించిందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన అభివృద్ధి అద్భుతమన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం ఉందని, స్థానిక సంస్థల్లోనూ కూటమిని గెలిపిస్తే 'ట్రిపుల్ ఇంజిన్' సర్కార్‌గా అభివృద్ధి, సంక్షేమం వేగంగా ముందుకుసాగుతాయని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన 'పల్లె పండుగ 1.0', 'పల్లె పండుగ 2.0', శాస్కి పథకాల ద్వారా గ్రామీణ రహదారులు రూపురేఖలు మారాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కూటమి సూపర్ సిక్స్ హామీలను వివరించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు,తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2, స్త్రీశక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ హామీలు సక్సెస్ ఫుల్ గా అమలు చేస్తున్నామన్నారు. ప్రత్యేకించి రైతాంగం ఆరుగాలం శ్రమించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో కేవలం ఒకరికి మాత్రమే ఆర్థికసాయం అందించి చేతులు దులుపుకుందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది చదువుకుంటుంటే అంతమందికి ఏటా రూ.15 వేల సాయం చేస్తోందన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ ను 4000కు పెంచి ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.1000 పెంచేందుకు 5 ఏళ్ల కాలం తీసుకుంటే తాము వచ్చిన వెంటనే అమలు చేశామని అది కూటమి ప్రభుత్వ ఘనతగా అభివర్ణించారు. ధాన్యపు బకాయిలను సైతం కూటమి ప్రభుత్వమే చెల్లించిందన్నారు.

క్షేత్రస్థాయిలో కూటమి ఉన్నప్పుడే చిట్టచివరి పేదవారికి సాయం అందుతుందన్నారు. పై నుండి క్షేత్రస్థాయి వరకు అభివృద్ధికి వీలు పడుతుందన్నారు. కూటమిని గెలిపిస్తే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చేసే కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు..అధికార పార్టీ వల్లనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు.

అనుభవజ్ఞుడైన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

○ ఏపీ హంస అధ్యక్షుడు అరవా పాల్



విజయవాడ, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పరిపాలనా, ఆర్థిక, సర్వీసు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ హంస అధ్యక్షుడు అరవా పాల్ డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.

స్థానిక జనాభా, రోగుల సంఖ్య, పని ఒత్తిడికి అనుగుణంగా సిబ్బంది హేతుబద్ధీకరణ చేపట్టాలని అన్నారు. 24 గంటల ప్రసూతి సేవలందించే పీహెచ్‌సీల్లో తగినంత నర్సింగ్ సిబ్బందిని నియమించాలని, పదోన్నతులు, పదవీ విరమణలతో ఖాళీ అయ్యే పోస్టులను రద్దు చేయకుండా కేడర్ బలాన్ని పెంచాలని కోరారు. నర్సులకు సంబంధం లేని అదనపు పనులను తగ్గించాలని సూచించారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో జాప్యాన్ని నివారించి జిల్లా, జోనల్, మల్టీ జోనల్ కేడర్ల సీనియారిటీ జాబితాలను త్వరగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్రమబద్ధీకరించిన ఉద్యోగుల ప్రొబేషన్, జీతాలు, సర్వీసు ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వడంతో పాటు పెండింగ్ జీతాలు, రాత్రి విధుల భత్యం, ప్రయాణ, రేషన్, యూనిఫాం, ధోబీ భత్యాలను వెంటనే చెల్లించాలని కోరారు.

మారుమూల, గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముఖ గుర్తింపు హాజరుకు ప్రత్యామ్నాయ విధానం కల్పించాలని అన్నారు. పలు మొబైల్ యాప్‌లలో ఒకే సమాచారాన్ని పదేపదే నమోదు చేసే విధానాన్ని తొలగించి సమగ్ర డిజిటల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.

ఏఎన్ఎంలు, ఆరోగ్య సహాయకుల విధులను స్పష్టంగా విభజించాలని, ఉద్యోగులపై దాడులను అరికట్టేందుకు ఆసుపత్రుల్లో భద్రత పెంచాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల కోసం పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర ఉపశమనం ప్రకటించాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని అరవా పాల్ కోరారు. ఉద్యోగుల సమస్యలను కాలపరిమితితో పరిష్కరిస్తేనే ప్రజలకు అందే వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు.

జాహ్నవి రెడ్డికి మహిళా లోకం బ్రహ్మరథం

○ భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి నేతల పిలుపు



కనిగిరి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): పామూరు మండల జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి జాహ్నవి రెడ్డికి మహిళలు, ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలుకుతూ మద్దతు ప్రకటించారు. సోమవారం తూర్పు కట్టకిందపల్లె గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో కూటమి నేతలు విస్తృతంగా పాల్గొని జాహ్నవి రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పామూరు మండల టీడీపీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పామూరు ఎంపీపీ అభ్యర్థి పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, కనిగిరి ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ నీరుకట్టు హరిబాబు తదితరులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బైరెడ్డి జయరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. జాహ్నవి రెడ్డికి భారీ మెజారిటీ అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రచారానికి ప్రజల నుంచి లభిస్తున్న స్పందన కూటమి అభ్యర్థి విజయానికి సంకేతంగా ఉందని తెలిపారు.

ప్రచారంలో పామూరు మండల క్లస్టర్ ఇన్‌చార్జులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, గుంటుపల్లి శ్రీనివాసులు, మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, ఎంపీటీసీలు పోక వెంకటరత్నం, బత్తుల వరమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు పెద్ది శెట్టి శ్రీనివాసులు, యగటీల కృష్ణయ్య, మోహన్‌రావు, పెద్ది శెట్టి లక్ష్మీనారాయణ, పాలపర్తి రమణయ్య, నీరుకట్టు మాల్యాద్రి, మల్లె రాహుల్ యాదవ్, యారవ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు బాలిక చికిత్స కోసం తక్షణ చెల్లింపుల కింద రూ.2 లక్షల విడుదల

○ వ్యక్తిగత ఆర్థిక సాయం కింద బాలిక కుటుంబానికి రూ.లక్ష అందించిన మంత్రి సత్యకుమార్

○ చికిత్సకు స్పందిస్తున్న బాధితురాలు



అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): అనంతపురం జిల్లా రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తరఫున తక్షణ అవసరాల కింద రూ.2 లక్షలు విడుదల చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు అనంతపురం సర్వజన ఆసుపత్రి వైద్యశాల అభివృద్ధి నిధి నుంచి సోమవారం బ్యాంకు ద్వారా ఈ మొత్తాన్ని బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రి యాజమాన్యానికి చెల్లించారు. దీనికి ముందుగానే మంత్రి సత్యకుమార్ యాదవ్ తన వ్యక్తిగత ఆర్థిక సాయం కింద రూ.లక్షను బాలిక కుటుంబానికి అందించారు. తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలిక ఆరోగ్యం మెరుగైన వైద్యంతో క్రమంగా కుదుటపడుతోంది.

ఘటన జరిగిన రోజు అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితిని చూసి మంత్రి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఉన్మాది క్రూర దాడిలో తీవ్ర రక్తగాయాలతో తొలుత అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చేరిన బాలికకు అక్కడి వైద్యులు వేగంగా స్పందించి చికిత్స అందించారు. దీంతో బాలిక ఆరోగ్యం మరింత విషమించకుండా నిలువరించగలిగారు. మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు వైద్యులు గోపిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన ఎనిమిది ప్యాకెట్ల రక్తాన్ని ఎక్కించారు. రక్తస్రావం జరుగుతున్న సమయంలోనే మత్తు ఇచ్చి తీవ్ర గాయాలకు చికిత్స అందించారు. అనంతపురం నుంచి బాలికను త్వరగా బెంగళూరుకు తరలించి మెరుగైన వైద్యం అందించేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ చూపారు. అక్కడి వైద్యులతో నిరంతరం మాట్లాడి చికిత్స వేగంగా అందేలా కృషి చేశారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతుండటంతో బాలిక రక్తపోటు క్రమంగా అదుపులోకి వచ్చింది. ఆదివారం వరకు రక్తపోటు నియంత్రణకు రెండు మందులు ఇవ్వగా, బాలిక స్పందించడంతో రాత్రికి ఒక మందును నిలిపివేశారు. మూత్ర విసర్జన వ్యవస్థ మెరుగుపడింది. రక్త పరీక్షల్లో మూత్రపిండాల పనితీరు సాధారణ స్థాయిలో ఉన్నట్లు సోమవారం వైద్యులు తెలిపారు.

వైద్య బృందానికి మంత్రి అభినందనలు: బెంగళూరులో బాలికకు చికిత్స అందిస్తున్న డాక్టర్ మయూర్ శెట్టి, డాక్టర్ లాల్‌చంద్, డాక్టర్ శిజ్జు, డాక్టర్ కౌశిక్, డాక్టర్ రవికిరణ్‌తో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతున్నారు. బాలిక ఆరోగ్యం మెరుగుపడేందుకు వారు చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. బాలికకు తక్షణ చికిత్స అందించడంలో వేగంగా స్పందించిన అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ హరికృష్ణ, మహేష్, సాంకేతిక నిపుణుడు గౌస్‌లను మంత్రి అభినందించారు. విధుల నిర్వహణలో వారు చూపిన చొరవను గుర్తిస్తూ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎ. విష్ణువర్ధన్ ప్రశంసా లేఖలు పంపించారు.

మురసు తుఫాన్‌పై ఏపీసీపీడీసీఎల్ అప్రమత్తం

○ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ముందస్తు చర్యలు.. అన్ని సర్కిళ్లు, డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు



విజయవాడ, అక్టోబర్ 26 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్రమత్తం చేసినట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున అన్ని జిల్లాల విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించి ముందస్తు చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతినే అవకాశం ఉన్నందున అవసరమైన సిబ్బంది, వాహనాలు, మరమ్మతు పరికరాలు, విద్యుత్ సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సీఎండీ సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేలా క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని, అధికారులు సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు విద్యుత్ ఉద్యోగులు సెలవులు తీసుకోవద్దని స్పష్టం చేశారు.

ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిల్, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తెగిపడిన విద్యుత్ తీగలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

విద్యుత్ అత్యవసర సేవల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఎండీ సూచించారు. కృష్ణ జిల్లా 6281709355, ఎన్టీఆర్ జిల్లా 9440817561, బాపట్ల జిల్లా 9281413774, గుంటూరు జిల్లా 9440817526, ప్రకాశం జిల్లా 9440817491, పల్నాడు జిల్లా 7661019447 నంబర్లను కంట్రోల్ రూమ్‌లుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాన్ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు.

గిరిజన ప్రాంత పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలకు ఐసీఎంఆర్ నుంచి రూ.76 లక్షల పరిశోధన నిధులు

○ మెరోపెనమ్ యాంటీబయాటిక్ ఔషధ నిరోధకతపై పరిశోధనకు మంజూరు

○ వైద్య విద్యార్థుల్లో పరిశోధనలకు ప్రోత్సాహం.. కొత్త కళాశాలకు కీలక మైలురాయి



అమరావతి, నవంబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్): గిరిజన ప్రాంతమైన పాడేరులోని ప్రభుత్వ వైద్య కళాశాల సూక్ష్మజీవ శాస్త్ర విభాగానికి భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) రూ.76 లక్షల పరిశోధన నిధులు మంజూరు చేసిందని వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. మెరోపెనమ్ (వీవతీశీజూవఅవఎ) అనే యాంటీబయాటిక్ ఔషధానికి వ్యాధికారక సూక్ష్మజీవుల్లో ఏర్పడుతున్న నిరోధకతపై అధ్యయనం చేసేందుకు ఈ నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతంలో కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలకు ఈ నిధుల మంజూరు పరిశోధన రంగంలో గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు.

మెరోపెనమ్ ఔషధం ప్రాధాన్యం: మెరోపెనమ్ ఒక శక్తివంతమైన యాంటీబయాటిక్ ఔషధం. తీవ్రమైన బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల చికిత్సలో వైద్యులు దీనిని వినియోగిస్తారు. ఈ ఔషధం బ్యాక్టీరియా కణ గోడ నిర్మాణాన్ని అడ్డుకోవడం ద్వారా వాటిని నాశనం చేస్తుంది. అయితే, కొన్ని బ్యాక్టీరియాలు ఈ ఔషధ ప్రభావాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి. దీంతో ఔషధం వినియోగించినప్పటికీ ఇన్ఫెక్షన్లను నియంత్రించడం కష్టమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఔషధ నిరోధకతపై పరిశోధన : యాంటీబయాటిక్ ఔషధాలకు బ్యాక్టీరియాలు లొంగకుండా ఉండే సామర్థ్యాన్ని ఔషధ నిరోధకత (ూాత్అఎఅషతీశీఎఖుశ్రీ =వంఅర్ఖుఅఎవ --ూవీ=) అంటారు. బ్యాక్టీరియాల్లో జన్యుపరమైన మార్పులు, ఔషధాన్ని విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌ల ఉత్పత్తి, ఔషధం కణంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం వంటి కారణాలతో ఈ నిరోధకత ఏర్పడవచ్చు. మెరోపెనమ్ వంటి ముఖ్యమైన యాంటీబయాటిక్‌లకు నిరోధకత పెరగడం వైద్య రంగానికి సవాలుగా మారుతోంది.

ఈ నేపథ్యంలో మెరోపెనమ్ ఔషధానికి సూక్ష్మజీవుల్లో ఏర్పడుతున్న నిరోధకతను అధ్యయనం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలాంటి పరిశోధనలు ఔషధ నిరోధకత తీరును అర్థం చేసుకోవడానికి, భవిష్యత్తులో సమర్థవంతమైన చికిత్సా విధానాల రూపకల్పనకు అవసరమైన శాస్త్రీయ సమాచారాన్ని అందించేందుకు దోహదపడతాయని పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుజ్జిబాబు వివరించారు.

పరిశోధన కార్యక్రమాలకు మరింత ఊతం

ఐసీఎంఆర్ నుంచి పరిశోధన నిధులు సాధించడం కళాశాలకు కీలక మైలురాయిగా నిలుస్తుందని డాక్టర్ బుజ్జిబాబు తెలిపారు. ఈ నిధులు కళాశాలలో పరిశోధన కార్యక్రమాలకు మరింత ఊతమివ్వడంతో పాటు, వైద్య విద్యార్థులు పరిశోధన రంగంలోకి అడుగు పెట్టేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తిని పెంచేందుకు, కొత్త పరిశోధన కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ అవకాశం దోహదపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బుజ్జిబాబు వివరించారు.

గిరిజన ప్రాంతంలో ఉన్న కొత్త వైద్య కళాశాలలో పరిశోధన కార్యకలాపాలు బలోపేతం కావడానికి ఈ నిధులు కీలకంగా నిలుస్తాయని తెలిపారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com